ప్రజాశక్తి

మంగళవారం 7 అక్టోబర్ 2025 | 8 పేజీలు

ఎన్‌టిఆర్ | కృష్ణా

వినియోగదారులకు ఊరటేదీ?

- రైతు బజార్లలో మండుతున్న టమోటా, ఉల్లి ధరలు
- రెండు నెలల్లో 124 టన్నులు మాత్రమే సరఫరా

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి: దసరా తరువాత కిలో టమోటా ధర నాలుగు రూపాయలకు పడిపోయింది. కొనేవారు లేక ఉల్లిపాయలు రోడ్లపై పారబోస్తున్నారు. గత కొన్ని రోజులుగా రాష్ట్రంలో ఇదే పరిస్థితి. ఉల్లి, టమోటా ధరలు పతనమైనా వినియోగదారులకు మాత్రం ఊరట దొరకడం లేదు. మార్కెట్‌లో వీటి ధరలు మండిపోతున్నాయి. రైతుల నుంచి నేరుగా సేకరించిన ఉల్లి, టమోటాలను నిరంతరాయంగా సరఫరా చేయడంలో వైఫల్యం చెందడంతో రైతు బజార్లలోనూ వినియోగదారులు ఉల్లి, టమోటాలను అధిక ధరలు వెచ్చించాల్సి వస్తోంది.

ధరలు పతనమై నష్టాలు మూటగట్టుకుంటున్న రైతులను ఆదుకోవడానికి, ధరాఘాతం నుంచి వినియోగదదారులకు ఊరట కలిగించేందుకు నోలాస్ నో ప్రాఫిట్ పద్ధతిలో మార్కెటింగ్ శాఖ ద్వారా నేరుగా ఉల్లి, టమోటాలను సేకరించి రైతు బజార్లలో విక్రయిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. రైతులకు వినియోగదారులకు అనుసంధానంగా రైతు బజార్లు పనిచేయాల్సి ఉంది. మచిలీపట్నంలో రెండు, పెడన, చల్లపల్లి, కూచిపూడి, పామర్రు, ఉయ్యూరు, గుడివాడ, గన్నవరం, కంకిపాడుల్లో జిల్లా వ్యాప్తంగా పది రైతు బజార్లున్నాయి. ఈ రైతు బజార్లలో సోమవారం ఉల్లి, టమోటా కిలో రూ.21కి విక్రయించారు.

జిల్లా వ్యాప్తంగా ఎక్కడా వర్షాకాలంలో ఉల్లి, టమోటా పంటలు సాగవ్వడం లేదు. కర్నూలు జిల్లా ప్యాపిలీ, పత్తికొండ మార్కెట్‌ల నుంచి టమోటా, కర్నూలు మార్కెట్ నుంచి ఉల్లిపాయలను మార్కెటింగ్ శాఖ సేకరిస్తోంది. అక్కడ తొమ్మిది రూపాయలకు కొనుగోలు చేసిన టమోటా, ఉల్లికి రెండు రూపాయలు రవాణాఛార్జీలు, రెండు రూపాయలు విక్రయదారునికి కమిషన్‌గా చెల్లిస్తూ రైతు బజారులో రూ.13కు విక్రయిస్తున్నారు. నేరుగా సేకరించిన ఉల్లి, టమోటాలను నిరంతరాయంగా సరఫరా చేయడంలో మార్కెటింగ్ శాఖ విఫలమవుతోంది. రోజు విడిచి రోజు, రెండు రోజులకు ఒకసారి మాత్రమే సరఫరా చేస్తోంది. మార్కెటింగ్‌శాఖ సరఫరా చేసిన రోజుల్లోనే రైతు బజార్లలో వీటి ధరలు తగ్గుతున్నాయి. మిగిలిన రోజుల్లో (మిగతా 2లో)

విజయవాడ రాఘవయ్య పార్కు వద్ద సిపిఎం ఆధ్వర్యాన నిరసన ప్రదర్శన

గవాయిపై దాడి అన్యాయం

... వార్తలు మెయిన్, టబ్లాయిడ్ 2లో

నేడు విజయవాడలో ఫ్యాప్టో ధర్నా

విజయవాడ: బోధనేతర పనులు తగ్గించాలని, ఉద్యోగుల, ఉపాధ్యాయుల ఆర్థిక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఫ్యాప్టో ఆధ్వర్యంలో 7వ తేదీ మంగళవారం విజయవాడ ధర్నా చౌక్‌లో రాష్ట్రస్థాయి ధర్నా నిర్వహించనున్నట్లు ఫ్యాప్టో ఎన్టీఆర్ జిల్లా చైర్మన్ జి.అలవాల సుందరయ్య, సెక్రటరీ జనరల్ డాక్టర్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మందుబాబుల్లో కలవరం

- ఇబ్రహీంపట్నంలో భారీగా కల్తీ మద్యం స్వాధీనం
- ఎఎన్ఆర్ బార్ సీజ్
- ఎ1 జనార్ధనరావు కోసం గాలింపు

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన చిత్తూరు జిల్లా మొలకలచెరువు కల్తీ మద్యం కేసు ఎన్‌టిఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంకు చేరింది. ఓ గోడౌన్‌లో భారీగా కల్తీ మద్యం బాటిళ్లు లభ్యం కావటంతో కొండపల్లి మున్సిపాలిటీతో పాటు ఇబ్రహీంపట్నం మండల పరిసర ప్రాంతాల మందుబాబులు ఆందోళన చెందుతున్నారు. కల్తీ మద్యం కేసులో ఎ1గా ఉన్న ఇబ్రహీంపట్నంకు చెందిన టిడిపి నేత అద్దేపల్లి జనార్ధనరావుకు చెందిన ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్‌లోని ఎఎన్ఆర్ బార్‌ను సోమవారం అధికారులు సీజ్ చేశారు. మూడు రోజులుగా ఐదు టీమ్‌లు ఈ కేసును దర్యాప్తు చేస్తున్నాయి. ఈ కేసులో ఇప్పటికే 12 మందిని అరెస్టు చేశారు. జనార్ధన్‌రావు సోదరుడు జగన్‌మోహన్‌రావు, జనార్ధన్ అనుచరుడు కట్టా రాజు ఎక్సైజ్ అధికారుల అదుపులో ఉన్నారు. వారిచ్చిన సమాచారంతో జనార్ధన్‌రావుకు చెందిన గోడౌన్‌లో తనిఖీలు చేపట్టగా భారీగా నకిలీ మద్యాన్ని అధికారులు కనుగొన్నారు. నకిలీ మద్యం బాటిళ్లకు లేబుల్స్ సీలింగ్ చేసే మిషన్లు, 35 లీటర్ల కెపాసిటీ కలిగిన 95 క్యాన్లు సీజ్ చేశారు. హోలోగ్రామ్ స్టిక్కర్లు, వందల కొద్దీ ఖాళీ బాటిళ్లు, కేరళ మార్ట్, ఓఎస్‌డీ బ్రాండ్లకు చెందిన స్టిక్కర్లు స్వాధీనం చేసుకున్నారు. స్పిరిట్, కారిమిల్‌ను మిక్స్ చేసి నకిలీ మద్యాన్ని నిందితులు సిద్ధం చేసినట్లు పోలీసులు గుర్తించారు. కల్తీ మద్యం కేసులో టీడీపీ నేత, ఏ1 జనార్ధన్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. జనార్ధన్ విదేశాలకు వెళ్లినట్లు అనుమానిస్తున్నారు.

'స్వచ్ఛ' పురస్కారాల్లో అగ్రస్థానం

ప్రజాశక్తి-విజయవాడ

పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణలో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన స్వచ్ఛాంధ్ర పురస్కారాలు-2025లో ఎన్‌టిఆర్ జిల్లాకు ఎనిమిది రాష్ట్రస్థాయి అవార్డులు లభించాయి. సోమవారం విజయవాడ తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో సిఎం చంద్రబాబునాయుడు స్వచ్ఛాంధ్ర పురస్కారాలను విజేతలకు అందజేశారు. మొత్తం 69 రాష్ట్రస్థాయి పురస్కారాల్లో ఎనిమిది పురస్కారాలు ఎన్‌టిఆర్ జిల్లాకు లభించాయి. ప్రత్యేక కేటగిరీ అవార్డులు (స్వచ్ఛ్ సర్వేక్షణ్)లో విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్, స్వచ్ఛ కాలనీల విభాగంలో విజయవాడలోని కేపీ నగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్, స్వచ్ఛ ఆసుపత్రుల విభాగంలో విజయవాడ హెచ్‌బీ కాలనీ యూపీహెచ్‌సీ, పెనుగంచిప్రోలు మండలం అనిగండ్లపాడు ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల, స్వచ్ఛ అంగన్వాడీలు విభాగంలో కేదారేశ్వరపేట-3 అంగన్వాడీ కేంద్రం, స్వచ్ఛ బస్ స్టేషన్ల విభాగంలో విజయవాడ బస్‌స్టేషన్, స్వచ్ఛ పాఠశాలల కేటగిరీలో విజయవాడ కర్మష్ణలంకలోని విఎంఆర్ఆర్ (జి) మునిసిపల్ కార్పొరేషన్ హైస్కూల్, స్వచ్ఛతా ఎన్‌జీవోలు కేటగిరీలో రైజ్ సంస్థ అవార్డులు సాధించాయి. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర లక్ష్య సాధనకు ముందడుగు వేస్తూ స్వచ్ఛాంధ్ర పురస్కారాల్లో ఎన్‌టిఆర్ జిల్లాను ముందు వరుసలో నిలిపినందుకు అధికారులు, సిబ్బందికి కలెక్టర్ లక్ష్మీశ అభినందనలు తెలిపారు. ఈ పురస్కారాలు స్ఫూర్తిగా జిల్లాను మరింత స్వచ్ఛత దిశగా నడిపించాలని ఆయన పేర్కొన్నారు. ఈ అవార్డుల (మిగతా 2లో)

సిఎం నుంచి అవార్డు అందుకుంటున్న ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర

ప్రతిఒక్కరూ స్వచ్ఛాంధ్రలో భాగస్వామ్యం కావాలి

- కృష్ణాజిల్లా ఇన్చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్

మాట్లాడుతున్న మంత్రి సుభాష్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): ప్రతిఒక్కరూ స్వచ్ఛతను బాధ్యతగా పాటిస్తూ స్వచ్ఛ ఆంధ్ర సాధన దిశగా జరుగుతున్న మహాయజ్ఞంలో భాగస్వాములు కావాలని కృష్ణాజిల్లా ఇన్చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్ పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాల్లో జరిగిన స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర పురస్కారాల ప్రదానంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఎంతో అంకితభావంతో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ముందుచూపుతో స్ఫూర్తిదాయకంగా ముందుకు తీసుకెళ్తున్నారని అభినందించారు. ప్లాస్టిక్ వాడకం ప్రమాదకరమని, కేన్సర్ వ్యాధికి ఇదే ముఖ్య కారణమని అన్నారు. చల్లపల్లి గ్రామాన్ని గత 11 సంవత్సరాలుగా పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దడంలో (మిగతా 2లో)

50వ డివిజన్‌లో పనులు ప్రారంభించాలి

ప్రజాశక్తి-విజయవాడ: వన్‌టౌన్‌లోని 50వ డివిజన్లో దీర్ఘకాలికంగా నిలిచిపోయిన పలు అభివద్ధి పనులు పూర్తి చేయాలని సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు కోరారు. ఈమేరకు సోమవారం పిజిఆర్ఎస్‌లో నగర కమిషనర్ ద్యానచంద్రకు సత్యబాబు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సత్యబాబు మాట్లాడుతూ... డివిజన్‌లోని పలు అభివృద్ధి పనులు నిలిచిపోయాయని పేర్కొన్నారు. పలుసార్లు అధికారుల దృష్టికి తీసుకొచ్చినా పట్టించుకోవడం లేదని, కాంట్రాక్టర్లు కూడా బిల్లులు రావడం లేదని ముందుకురావడం లేదని అన్నారు. డివిజన్‌లోని జడ పాపయ్య వీధి సిమెంట్ రోడ్డు పనులు పూర్తి చేయాలని కోరారు.అలాగే జండా చెట్టు వద్ద కమ్యూనిటీ హాలు నిర్మాణం ప్రారంభించాలని, నూకాలమ్మ గుడి నుండి రావులమ్మ ఇంటి వీధి వరకు రిటర్నింగ్ వాళ్ నిర్మాణ పనులు ప్రారంభించాలని కోరారు. ఆర్సియం స్కూల్ వెనుక భాగంలో ఆగిపోయిన సిసి రోడ్డు పూర్తి చేయడంతో పాటుజండా చెట్టు ఏరియాలో సిసి రోడ్డు ఏర్పాటు చేయాలన్నారు.కత్తి దుర్గారావు వీధి నుండి కొండ్రు బాబురావు వీధి వరకు సిసి రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపట్టాలన్నారు.కొండ ప్రాంతంలో కాలవలు, మెట్లు లాండింగ్ రిపేర్ పనులు చేపట్టాలని కోరారు. కమిషనర్‌ను కలిసిన వారిలో డివిజన్ సిపిఎం నాయకులు ఏ శ్రీనివాస్, బాబురావు తదితరులు ఉన్నారు.

మొదటిపేజీ తరువాయి

వినియోగదారులకు ఊరటేదీ?

వాటి ధరలు మండుతున్నాయి. అకస్మాత్తుగా పెరుగుతూ తగ్గుతూ ఉన్న ఉల్లి, టమోటా ధరలు చూసి వినియోగదారులు ముక్కున వేలేసుకుంటున్నారు.

రెండు నెలల్లో 124 టన్నులు మాత్రమే సరఫరా

జులై 28వ తేదీ నుంచి ఉల్లి, సెప్టెంబర్ 13వ తేదీ నుంచి టమోటాలను రోజు విడిచి రోజు, రెండు రోజులకు ఒకసారి మాత్రమే మార్కెటింగ్ శాఖ రైతు బజార్లకు సరఫరా చేస్తోంది. రెండున్నర నెలల్లో ఉల్లిపాయలు 92 మెట్రిక్ టన్నులు, టమోటా 33 టన్నులు మాత్రమే సరఫరా చేసింది. మార్కెటింగ్‌శాఖ రోజువారీ ఉల్లి టమోటాను సరఫరా చేస్తే రైతు బజార్లలో ఇప్పుడు విక్రయించిన పరిణామానికి రెండు రెట్లు విక్రయాలు జరిగేవని మార్కెటింగ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ మేరకు వినియోగదారులకు ఊరట లభించేంది. ఈ నేపథ్యంలో రైతు నుంచి సేకరించిన ఉల్లి, టమోటాలను రోజువారీ మార్కెటింగ్ శాఖ సరఫరా చేసి తక్కువ ధరలకు అందించాలని వినియోగదారులు కోరుతున్నారు.

ప్రతిఒక్కరూ స్వచ్ఛాంధ్రలో భాగస్వామ్యం కావాలి

విశేష కృషి చేస్తున్న బిఆర్కే ప్రసాదు, పద్మావతిలను అభినందించారు. చల్లపల్లి గ్రామంలో ఏ వివాహ వేడుక జరిగిన ప్లాస్టిక్ లేకుండా నిర్వహించడంలో వారు చూపుతున్న చొరవ గొప్పదన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లోనూ ప్లాస్టిక్ వాడకం తగ్గించడం అభినందించదగ్గ విషయమన్నారు. ప్రభుత్వం ప్రకటించిన 69 రాష్ట్రస్థాయి స్వచ్ఛ ఆంధ్ర బహుమతుల్లో జిల్లాకు నాలుగు బహుమతులు రావడం, జిల్లా స్థాయిలో 44 బహుమతులు రావడం జిల్లాకే గర్వకారణమన్నారు. జిల్లా కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ రానున్న 3 నెలల్లో అన్ని మున్సిపాలిటీల్లో ఒక కార్యాచరణ ప్రణాళిక ద్వారా స్వచ్ఛత కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపట్టబోతున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, జడ్పీ సీఈవో కన్నమనాయుడు, డిప్యూటీ సీఈఓ ఆనందకుమార్, మచిలీపట్నం, గుడివాడ, తాడిగడప మునిసిపల్ కమిషనర్లు బాపిరాజు, మనోహర్‌రావు, నజీర్, మెప్మా పీడీ సాయిబాబు, డిఆర్డిఏ పీడీ హరిహరనాథ్, డిఐసి జిఎం వెంకటరావు, డిపిటివో వెంకటేశ్వర్లు, జిల్లా టూరిజం అధికారి రామ్ లక్ష్మణ్, ఐసిడిఎస్ పీడీ ఎంఎన్ రాణి పాల్గొన్నారు.

పురస్కారాలు అందుకుంటున్న అధికారులు

ఎలక్ట్రానిక్ వస్తువుల గోడౌన్ దగ్ధం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడు సోమవారం ఉదయం భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఎనికేపాడులోని ఓ ప్రముఖ కంపెనీకి సంబంధించిన ఎలక్ట్రానిక్ పరికరాలు నిల్వచేసే గోదాంలో ఈ ఘటన చోటుచేసుకుంది. మంటలు ఎగిసిపడుతుండటంతో విలువైన ఎలక్ట్రానిక్ పరికరాలు అగ్నికి ఆహుతి అయినట్లు తెలుస్తోంది. భారీ నష్టం వాటిల్లే అవకాశం ఉందని నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులో భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఎనికేపాడులోని ఈరోజు ఉదయం ఓ ప్రముఖ కంపెనీకి సంబంధించిన ఎలక్ట్రానిక్ పరికరాలు నిల్వచేసే గోదాంలో ఈ ఘటన చోటుచేసుకుంది. మంటలు ఎగిసిపడితుండటంతో విలవైన ఎలక్ట్రానిక్ పరికరాలు అగ్నికి ఆహుతి అయినట్లు తెలుస్తోంది. భారీ నష్టం వాటిల్లే అవకాశం ఉందని నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు చుట్టూ పక్కల ప్రాంతాలను పొగ కమ్మేసింది. పొగ ధాటికి స్థానికులు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. స్థానికులను ప్రమాదం జరిగిన ప్రాంతం నుంచి దూరంగా పంపించివేస్తున్నారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం సష్టించింది. వెంటనే నిర్వాహకులు అగ్నిమాపక అధికారులకు, పోలీసులకు సమాచారం అందజేశారు. సమాచారం అందటంతో హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పే ప్రయత్నం చేస్తున్నారు ఫైర్ సిబ్బంది. ఈ అగ్ని ప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణమని నిర్వాహకులు భావిస్తున్నారు. ఈ అగ్నిప్రమాదంలో సుమారు రూ.3 కోట్లకు పైగా ఆస్తినష్టం జరిగి ఉంటుందని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు.

సబ్‌వే నిర్మాణానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్

ప్రజాశక్తి-విజయవాడ: ఇటీవల విజయవాడ ఎంపీ శివనాథ్ రైల్వే శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ కు లేఖ రాసి, మధురానగర్- వాంబే కాలనీ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న తీవ్ర సమస్యలను వివరించారు. వాంబే కాలనీ, అజిత్ సింగ్ నగర్ వంటి ప్రాంతాల నుండి లక్షకు పైగా కుటుంబాలు వివిధ అవసరాల కోసం విజయవాడ నగరానికి నిత్యం రాకపోకలు జరుపుతుంటారని యంపి తన లేఖలో పేర్కొన్నారు. ఈ ప్రాంత ప్రజలు చెన్నై -హౌరా హై స్పీడ్ లైన్ దాటాల్సి రావడం వల్ల అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని అన్నారు. ఎంపీ లేఖపై స్పందించిన రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్, మధురానగర్ - వాంబే కాలనీ మధ్య లిమిటెడ్ హైట్ సబ్ వే (ఎల్‌హెచ్‌ఎస్) నిర్మాణానికి ఆమోదం తెలిపి, డిజైన్ , డ్రాయింగ్ పనులు ప్రారంభమయ్యాయని సోమవారం అధికారికంగా లేఖ ద్వారా ఎంపీకి తెలియజేశారు. కేంద్ర రైల్వేశాఖ తీసుకున్న ఈ నిర్ణయం వాంబే కాలనీ, మధురానగర్ ప్రజలకు ఎంతో ఊరట కలిగిస్తుందని యంపి శివనాథ్, సెంట్రల్ నియోజకవర్గం ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇకపై ప్రమాదకర రీతిలో రైల్వే లైన్ దాటాల్సిన అవసరం లేకుండా, భద్రతతో కూడిన రవాణా సదుపాయం లభించనుందని ఎంపి అన్నారు.

'స్వచ్ఛ' పురస్కారాల్లో అగ్రస్థానం

వెనక ప్రజల సహకారం, కార్మికుల, ఉద్యోగుల శ్రమ ఉందని విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ డాక్టర్ డి చంద్రశేఖర్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కే అర్జున్‌రావు, చీఫ్ సిటీ ప్లానర్ కె.సంజయ్ రత్నకుమార్, జాయింట్ డైరెక్టర్ అమృత, ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకట నారాయణ, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబు శ్రీనివాస్ పాల్గొన్నారు.

IN THE HON'BLE COURT OF THE II ADDL. CIVIL JUDGE (SENIOR DIVISION) AT: VISAKHAPATNAM I.A.1016/2024 in O.S.241/2017

Between:
Visakhapatnam Metropolitan Region Development Authority,
Rep. by its Estate Officer,
Visakhapatnam ...Petitioner/Plaintiff
And:
Ommi Paidamma & others
...Respondents/Defendants

NOTICE

To,
R-1: Ommi Paidamma, W/o. late Appanna, R/at Gollala Yendada Village, Visakhapatnam.
R-4: K. Karuna Kumar, S/o. late Suryanarayana, Rtd. A.O, Udyog Bhavan, Siripuram, Visakhapatnam.
R-6: B. Sridhar IAS,
Presently working as member Secretary A.P. Pollution Control Board, Amaravathi, Vijayawada.

Please take notice that the above named petitioner/plaintiff filed a petition under order IX Rule 4 of C.P.C. to set aside the dismissal order against the defendants D-1, D-4 & D-6 dt.15-12-2017 in the above suit along with Section 5 of Limitation petition before this Hon'ble Court on that the Hon'ble Court was pleased to order notice to respondents 1, 4, and 6 in the above matter by way of paper publication and the same is posted to **23-10-2025** for appearance of the respondents 1, 4 and 6. Therefore, you are here by attend before the aforesaid mentioned Hon'ble Court at Visakhapatnam on **23-10-2025** at **10:30 A.M.**, personally or through your counsel, failing which the matter will be heard and determined in your absence, exparte as per law.

JANNELA SRINIVASA RAO,
Advocate
Visakhapatnam — Visakhapatnam.
Dt. 06-10-2025 — **Cell: 9848561176.**

IN THE HON'BLE COURT OF THE II ADDL. CIVIL JUDGE (SENIOR DIVISION) AT: VISAKHAPATNAM I.A.1017/2024 in O.S.241/2017

Between:
Visakhapatnam Metropolitan Region Development Authority,
Rep. by its Estate Officer,
Visakhapatnam ...Petitioner/Plaintiff
And:
Ommi Paidamma & others
...Respondents/Defendants

NOTICE

To,
R-1: Ommi Paidamma, W/o. late Appanna, R/at Gollala Yendada Village, Visakhapatnam.
R-4: K. Karuna Kumar, S/o. late Suryanarayana, Rtd. A.O, Udyog Bhavan, Siripuram, Visakhapatnam.
R-6: B. Sridhar IAS,
Presently working as member Secretary A.P. Pollution Control Board, Amaravathi, Vijayawada.

Please take notice that the above named petitioner/plaintiff filed a petition under order IX Rule 4 of C.P.C. to set aside the dismissal order against the defendants D-1, D-4 & D-6 dt.15-12-2017 in the above suit along with Section 5 of Limitation petition before this Hon'ble Court on that the Hon'ble Court was pleased to order notice to respondents 1, 4, and 6 in the above matter by way of paper publication and the same is posted to **23-10-2025** for appearance of the respondents 1, 4 and 6. Therefore, you are here by attend before the aforesaid mentioned Hon'ble Court at Visakhapatnam on **23-10-2025** at **10:30 A.M.**, personally or through your counsel, failing which the matter will be heard and determined in your absence, exparte as per law.

JANNELA SRINIVASA RAO,
Advocate
Visakhapatnam — Visakhapatnam.
Dt. 06-10-2025 — **Cell: 9848561176.**

గవాయిపై దాడి ప్రజాస్వామ్యానికే ప్రమాదం

ప్రజాశక్తి-విజయవాడ : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయిపై మతోన్మాదుల దాడి ప్రజాస్వామ్యానికే తీవ్ర ప్రమాదమని సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డి.వి.యిఔష్ణ అన్నారు. మతోన్మాదులు రెచ్చగొట్టే చర్యలకు ఇది పరాకాష్టగా పేర్కొన్నారు. గవాయిపై దాడికి నిరసనగా సోమవారం విజయవాడ బందరురోడ్డులోని రాఘవయ్యపార్కు వద్ద సిపిఎం ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా డి.వి.కృష్ణ మాట్లాడుతూ మతోన్మాదులు ఆగడాలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, డి.సుబ్బారావు, కె.ధనలక్ష్మి, నిర్మల, వి.కష్ణయ్య, వై.నరసింహారావు, రైతు సంఘం నాయకులు ఎం.హరిబాబు, విజయవాడ నగర పాలక సంస్థ ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇది దేశ అత్యున్నత న్యాయ వ్యవస్థపై దాడి

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయిపై సనాతనం పేరుతో జరిగిన దాడి ప్రయత్నాన్ని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులు సుంకర రాజేంద్ర ప్రసాద్, ఐలు ఎపి రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.కుమార్, ఎన్.మాధవరావు, కృష్ణాజిల్లా కార్యదర్శి సంపర శ్రీనివాస్ సోమవారం వేర్వేరు ప్రకటనల్లో ఖండించారు. ఇది భారత అత్యున్నత న్యాయ వ్యవస్థపై, భారత రాజ్యాంగంపై, న్యాయ వ్యవస్థ స్వతంత్రతపై, జుడీషియల్ రివ్యూ అధికారంపై, లౌకికవాదంపై అసహనంతో జరిగిన దాడి అని వారు పేర్కొన్నారు. రాజ్యాంగం కంటే సనాతన ధర్మమే గొప్పదని ప్రచారం చేసి ప్రజల మధ్య మత చిచ్చు పెట్టి, మత విభజనను, మత విద్వేషాన్ని రేపుతున్న సంస్థలు, పాలకుల తీరు వల్లే సుప్రీంకోర్టు గౌరవానికి భంగం కలిగించే ఇటువంటి కుట్రలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ప్రభుత్వం పూర్తి విచారణ జరిపి, సంబంధిత వ్యక్తిపై, అతని వెనుక ఉన్న సంఘ వ్యతిరేక శక్తులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, సిజెఐ గవాయికి రక్షణ మరింత పెంచాలని, న్యాయ వ్యవస్థ స్వతంత్రతను కాపాడాలని కోరారు.

CHANGE OF NAME

I, **VENKATA JAMALAMMA BELLAMKONDA** (Old Name), W/o. **BELLAMKONDA SRINIVASA RAO**, Resident of Door No: 13-363, 8th road Devudi Cheruvu, Mylavaram Village, Mylavaram Mandal, NTR District, Andhra Pradesh - 521230. I have changed my name as **BELLAMKONDA VENKATA JAVALAMMA** (New Name) W/o. **BELLAMKONDA SRINIVASA RAO**. Hereafter my name is known as **BELLAMKONDA VENKATA JAVALAMMA** (New Name) W/o. **BELLAMKONDA SRINIVASA RAO** for all purposes.

CHANGE OF SURNAME

I, Salakaparapu Vamsi Krishna S/o. S. Pandu Ranga Rao, Door No. 43-11-12A, American Hospital Road, Ajithsinghnagar, I declare that my wife name is **Appikonda Sravya** as per after marriage surname is **Sravya Salakaparapu**. Both the names **Sravya Salakaparapu** and **Appikonda Sravya** are one and same and belongs to my wife. Henceforth, consider my wife name is **Appikonda Sravya** further.

ఒరిజినల్ డాక్యుమెంట్ పోయినది

కృష్ణాజిల్లా పెనమలూరు మండలం కానూరు నివాసితులైన జగిలింకి తిరుపతిరావు S/O సోములు నకు సంబంధించిన క్రిష్ణాజిల్లా, ఉంగుటూరు మండలం, ఎలుకపాడు రెవెన్యూ లో ఆర్ఎస్ నెం: 23 లో 0.50 సెంట్లు భూమికి సంబంధించిన స్థరాస్థి ఒరిజినల్ డాక్యుమెంట్ నెంబర్: 3676/ 2007 పోయినవి. ఇవి ఉంగుటూరు మండల కేంద్రంలో పట్టాదారు పాసుపుస్తకాల కోసం అర్జీ పెట్టడానికి జిరాక్స్ తీయించుకుంటున్న నేపథ్యంలో పోయినవి. దీనికి సంబంధించి పోలీస్ వారికి సమాచారం అందించడం జరిగింది. ఎవరికైనా దొరికినచో ఈ కింది అడ్రస్ కు తెలియజేయగలరు.

ఇట్లు
జగిలింకి తిరుపతిరావు
ఫోన్ నెం 7842055504.

ప్రకటన

నా క్లయింట్ బ్యాంకు ఆఫ్ బరోడా పి.నైనవరం బ్రాంచ్ మేనేజర్ గారి సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా,

అంబాపురం వాస్త్యవ్యులు అయినా శ్రీమతి కాటుపల్లి కాత్యాయిని W/o యం. కోటేశ్వర రావు ఈ దిగువ షెడ్యూల్ స్థిరాస్తిని మైలవరపు ఉమామహేశ్వర రావు S/o సుబ్బారావు గారి వద్ద నుండి కొనుగోలు చేయుచున్నారు. కావున మైలవరపు ఉమామహేశ్వర రావు గారు కొనుగోలు చేసిన విష్ణుమొలకల రామతీర్థ S/o వీర బసవయ్య వారి స్థిరాస్తి కి సంబంధించిన ఒరిజినల్ దస్తావేజు పోయినవి. డాక్యుమెంట్ నెంబర్ 10527 / 2006. కావున పోలీస్ వారి వద్ద కంప్లైంట్ వేసి దాని ద్వారా No.1 True Certificate ది. 26-09-2004 న పొంది వున్నారు. కావున ఈ దస్తావేజు ఎవరికైన దొరికిన ఈ క్రింది అడ్రస్ కు తెచ్చి ఇవ్వగలరు. లేనిచో పోస్ట్ ద్వారా అయినా పంపగలరు. కాటుపల్లి కాత్యాయనీ గారు మా క్లయింట్ మా వద్ద ఋణము పొంద కోరు చున్నారు. కావున ఎవరికైనను పై స్థిరాస్తిపై ఎటువంటి లావాదేవీలు ఉన్న యెడల తెలుపగలరు. ఒక వారము రోజులలో రిజిస్టర్ పోస్టు ద్వారా తెలియజేయగలరు. గడువు దాటి వచ్చిన అభ్యంతరములు బైండు చేయజాలవు. పై స్థిరాస్తి నిర్వివాదంగా భావించి మా క్లయింట్ కు ఋణము మంజూరు చేయబడును.

ఎ-షెడ్యూల్ : కృష్ణ జిల్లా విజయవాడ రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్, విజయవాడ జిల్లా రిజిస్ట్రార్ వారి ఇలాకా విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ ఏరియాలో చేరిన, విజయవాడ టౌన్ విద్యాధరపురం విలేజ్ పోర్షన్, చిట్టినగర్లోని కలరా హాస్పిటల్ సమీపములో గల దీనదయాళ్ నగర్ లో యున్నారువంటి ఆస్తికి ఆర్.ఎస్. నెంబర్ 150/ఎ, డోరు నెం.5-7/8-56/1, అసెస్మెంట్ నెం. 35440, మున్సిపల్ వార్డు నెం.5/2 ర్లు దాఖలా చ.గ. 577లు స్థిరాస్తి నివేశన స్థలమునకు హద్దులు.
తూర్పు : రోడ్డు
దక్షిణం : బి.వి.ఎస్. పట్నాయక్, ప్రత్తి సుబ్రహ్మణ్యం గారల ఆస్తి పడమర : రోడ్డు ఉత్తరం : రోడ్డు

ఈ నాలుగు హద్దుల మధ్య చ.గ.577.28 లు లేక చ.మీ.482.68 ర్లు స్థిరాస్తి నివేశన స్థలములో అనిర్దష్ట అవిభాజ్య, జాయింట్ చ.గ.25 లు లేక చ.మీ.20.90 ర్లు స్థిరాస్తి స్థలమున్నూ మరియు

బి- షెడ్యూల్ : పైన తెలిపిన ఎ - షెడ్యూల్ దాఖలా మొత్తము స్థలములో నిర్మించబడియున్న పట్నాయక్ టవర్స్ అను పేరు గల అపార్టుమెంట్స్ లోని థర్డ్ ఫ్లోరులోని ప్లాట్ నుఎంబెర్ 'యఫ్' అపార్టుమెంటుకు హద్దులు:
తూర్పు : కారిడార్ దక్షిణం : ఓపెన్ టు స్కై
పడమర : ఓపెన్ టు స్కై ఉత్తరం : ప్లాటు నెం. 'డి'

ఈ నాలుగు హద్దుల మధ్య చ.అ.855 లు ప్లింత్ ఏరియా, చ.అ . 15 లు కామం ఏరియా మరియు చ.అ. 15 లు పార్కింగ్ ఏరియాతో సహాయున్నూ సదరు ప్లాటుకు అమర్చబడియున్న యావద్విశిష్ట కలప సామాను, ఇందలి ఎలక్ట్రికల్ ఫిట్టింగ్స్, లెట్రిన్, బాత్ రూమ్ లతో సహా, సదరు అపార్టుమెంట్ కాం ప్లెక్స్ లోని ఇతర క్రయదారులతో పాటు మెట్లు, కామన్ ఏరియాలు, వాటర్, డ్రైనేజీ మొదలగు వానిలో ఈ అపార్టుమెంట్ వారికి ఏర్పడియున్న అన్ని విధములైన జాయింట్ వినియోగపు హక్కులతో సహాయున్నూ ఎ, బి షెడ్యూల్ ల దాఖాలా ఆస్తిపై నాకు గల యావత్తు ఈజ్మెంట్ హక్కులతో సహాయున్నూ మీకు విక్రయించి, మీ స్వాధీన పరచడమైనది.

ఇట్లు
M.D. PRABHAKAR, M.Com., LL.M., ADVOCATE
D.No.31-16-30, Bullemma Veedhi, Machavaram, Vijayawada-520004,
Cell : 9290055959
Email: advdurgaprabhakar@gmail.com

సమస్యలు వింటున్న ఎస్‌పి విద్యాసాగర్‌నాయుడు

ఫిర్యాదులు సకాలంలో పరిష్కరించాలి : ఎస్‌పి

ప్రజాశక్తి - కలక్టరేట్ (కృష్ణా) : ప్రజా ఫిర్యాదుల ను చట్ట పరిధిలో పరిష్కరిస్తూ వారికి బాసటగా నిలవాలని జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు సూచించారు.సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ప్రజలనుండి అర్జీలు స్వీకరించారు.అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు వారి దైనందిన జీవితంలో ఎదుర్కొనే ప్రతి సమస్య గుర్చి పరిష్కారం కోసం పోలీస్ శాఖను ఆశ్రయిస్తారని అలా నమ్మకంతో పోలీసులను ఆశ్రయించే ప్రజల పక్షాన నిలబడి వారి సమస్యను సానుకూలంగా విని, చట్ట పరిధిలో పూర్తి విచారణ జరిపి, వారి సమస్యకు పరిష్కారం అందిస్తామనే నమ్మకాన్ని వారిలో పెంపొందించాలన్నారు. మొత్తం 42 ఫిర్యాదులు అందినట్లు ఎస్పీ కార్యాలయ అధికారులు తెలిపారు.

మట్టి ఖర్చులకు సాయం

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : మచిలీపట్నం మండల పరిధిలోని కానూరు గ్రామానికి చెందిన బొమ్మిడి రామారావు మృతిచెందగా ఆయన భార్య బొమ్మిడి నాగేశ్వరమ్మకు కానూరు శ్రీ వెంకటేశ్వర పిఏసిఎస్ తరుపున కృష్ణా జిల్లా తెలుగు రైతు అధ్యక్షులు (మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్) గోపు సత్యనారాయణ, పిఏసిఎస్ అధ్యక్షులు ప్రతాప్ నరేష్ కుమార్‌ల చేతుల మీదగా మట్టి ఖర్చుల నిమిత్తం పదివేల రూపాయలు సోమవారం అందించారు. ఈ కార్యక్రమంలో సంఘ సెక్రెటరీ అడపా శ్రీనివాసరావు, పీత రాము,బొమ్మిడి ఏడుకొండలు, గోపు వెంకట రమణ, మోపిదేవి కృష్ణ, బొమ్మిడి లక్ష్మణ్ రావు, సేరు నరసింహ రావు, బొట్టు రాజేష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని తొమ్మిది గ్రామాలకు మంగళవారం ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని విద్యుత్ ఈఈ జి.బి.శ్రీనివాసరావు తెలిపారు. 33/11 కె.వి. కవుతరం సబ్ స్టేషన్‌లో 11కె.వి. విన్నకోట ఫీడర్ పరిధిలోని విన్నకోట, సుబ్బు చెరువు, జేమ్స్ పేట, చింతలకుంట తాడిచర్ల, కట్లవాని చెరువు, పురిటిపాడు, చిన్నగొన్నూరు, శేరీదగ్గుమిల్లి, గ్రామాలలో విద్యుత్ లైన్లకు దగ్గరగా ఉన్న చెట్లను కొడుతున్నందునా ఆయా గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందన్నారు.

బస్సుల్లేక ప్రయాణికుల ఇబ్బందులు

ప్రజాశక్తి-మచిలీపట్నంఅర్బన్ : పోర్ట్ సిటీగా అవతరిస్తున్న మచిలీపట్నం, రాజధాని కేంద్రంగా ఉన్న విజయవాడ మధ్య గతంతో పోలిస్తే ప్రయాణికుల రాకపోకలు విపరీతంగా పెరిగాయి. ఏపీఎస్‌ఆర్టీసీ ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సు సర్వీసులు నడపడంలో విఫలమవుతోందని ప్రయాణికులు గగ్గోలు పెడుతున్నారు. ప్రతిరోజు రాత్రి సమయంలో విజయవాడ బస్టాండ్ నుండి మచిలీపట్నంకు తగిన ఆర్టీసీ బస్సులు లేకపోవడం వలన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ముఖ్యంగా మహిళలు వద్దులు లగేజీలతో ఉన్న వాళ్ల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏపీఎస్‌ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, స్థానిక మంత్రి కొల్లు రవీంద్ర జోక్యం చేసుకొని విజయవాడ నుండి ప్రతిరోజు రాత్రి సమయం లో అదనపు నాన్ స్టాప్ సర్వీసులను ఏర్పాటు చేయాలని కోరారు. ఆదివారం రాత్రి దాదాపు రెండు గంటల పైగా క్యూ లైన్ లో ఉంటే గాని నాన్ స్టాప్ టికెట్ దొరకలేదని, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని మొరపెట్టుకుంటున్నారు. మద్రాసు, హైదరాబాదు, విశాఖపట్నం నుండి రాత్రి రైళ్లలో వచ్చే ప్రయాణికులు మచిలీపట్నం రావాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఒంటరిగా వచ్చే మహిళలు, వృద్ధులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. విజయవాడకు మచిలీపట్నానికి మధ్య ప్రయాణికుల సంఖ్య పెరిగిందని ఆర్టీసీ, రైల్వేలకు అదనపు సౌకర్యాలు ఏర్పాటు చేయాలని స్థానిక న్యాయవాది బాలాజీ డిమాండ్ చేశారు. ఆర్టీసీ బస్సులు లేకపోవడం వలన ప్రైవేటు వాహన దారులు అదనపు ధరలతో ప్రయాణికులను దోచుకుంటున్నారన్నారు.

బందరు బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

పచ్చదనం పెంపుకు చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి-కలక్టరేట్(కృష్ణా) : మచిలీపట్నం ఓడరేవు చుట్టుపక్కల పర్యా వరణ పరిరక్షణ దిశగా పచ్చదనం పెంపొందించడానికి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డికె బాలాజీ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ లు నగరంలోని వారి చాంబర్లో బందరు ఓడరేవు పరిసరాలలో పచ్చదనం పెంపుదలపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అందరూ ఆరోగ్యంగా ఉండాలంటే పర్యావరణం బాగుండాలన్నారు. ఓడరేవు చుట్టూ పరిసరాలు, పర్యావరణం బాగుండా లంటే కాలుష్యం నియంత్రణకు పచ్చదనం పెంపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తొలి దశలో 264 ఎకరాల్లో పచ్చదనం పెంపుదలకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఓడరేవు నుండి 216 జాతీయ రహదారిపై వంతెనకు అనుసంధానం అయ్యేవిధంగా 560 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న 8.7 కిలోమీటర్ల రహదారికి సంబంధించి భూసేకరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో డిఎఫ్‌ఓ సునీత, ఏపీ గ్రీన్ బెల్ట్ కార్పొరేషన్ ఆర్కిటెక్ట్ సత్యనారాయణ, మోర్త్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సాయి శ్రీనివాసులు, ఇంజనీర్లు రమణ, అనుదీప్ తదితర అధికారులు పాల్గొన్నారు.

మసీదుకు ఎన్నికలు నిర్వహించాలని వినతి

ప్రజాశక్తి-చల్లపల్లి : చల్ల పల్లిలోని మస్జిద్ ఏ మహమ్మదీయకు (పెద్ద మసీదుకు) పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలని పలువురు ముస్లింలు జిల్లా కలెక్టర్ డికె బాలాజీ, వక్ఫ్ బోర్డు సీఈవో మహమ్మద్ సాలీకు విడివిడిగా వినతిపత్రం అందించారు. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా గత 20 సంవత్సరాలుగా రాజకీయ పలుకుబడిని ఉపయోగించి ఎన్నికలు జరగకుండా కమిటీ నియమాకాలు నియమిం చుకుంటున్నారని, కమిటీ గడువు ముగియటంతో ఈసారైనా ఎన్నిక ద్వారా నూతన కమిటీ నియమించాలని కోరారు. మసీదులో జరిగే కార్యక్ర మాలపై జమా తీకు సరైన సమాచారం ఇవ్వకుండా ఏకపక్షంగా వ్యవహరి స్తున్నా రని ఆరోపించారు. షేక్ రసూల్ ఘోరి, పఠాన్ కరీముల్లా ఖాన్, అమీర్ బేగ్, జహీర్, అబ్దుల్ సత్తార్ వినతిపత్రం సమర్పించారు

'విక్కుర్తి' ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-అవనిగడ్డ : విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని నియోజక వర్గంలో పలు ప్రాంతాలలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి అమ్మవారి విగ్రహాలను ప్రముఖ పారిశ్రామికవేత్త కూటమి నాయ కులు విక్కుర్తి శ్రీనివాసరావు సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విగ్రహ కమిటీ నిర్వాహకుల ఆహ్వానం మేరకు విక్కుర్తి శ్రీనివాస్ అవనిగడ్డ లోని పలు ప్రదేశాలలో ఏర్పాటుచేసిన అమ్మవారి విగ్రహాలను దర్శించుకున్నారు. స్థానిక గుర్రపు చెరువు వద్ద ఉన్న రామాలయంలో ఏర్పాటు చేసిన విగ్రహం, నాయి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని దర్శించుకొని పూ జలు చేశారు. శ్రీనివాస్ సోదరుడు రాంబాబు పాల్గొన్నారు.

'మానసిక ఆరోగ్యం, ఆహారపు అలవాట్ల' పై అవగాహన

విజయవాడ రూరల్ : రాష్ట్ర సమగ్ర శిక్ష రాష్ట్ర గర్ల్ చైల్డ్ డెవలప్మెంట్ అధికారి ఆదేశాలు మేరకు విజయవాడరూరల్ మండలం నున్నలోని జిల్లా పరిషత్, ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు "మానసిక ఆరోగ్యం-ఆహారపు అలవాట్లు" అనే అంశంపై అవగాహనను జిల్లా మెంటల్ హెల్త్ కౌన్సిలర్ రమేష్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక సమస్యలకు ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్స్, విటమిన్స్, ఒమేగా ఫ్యాటీ ఆసిడ్స్.. మొదలైనవి ఎక్కువగా ఉన్న ఆహార పదార్థములు తీసుకోవాలని సూచించారు. పాఠశాల హెడ్ మాస్టర్ రవి ప్రసాద్, ఉపాధ్యాయురాలు నళిని రామ్, సీనియర్ అధ్యాపకులు గోపీనాథ్, శివలక్ష్మి, అరుణ కుమారి పాల్గొన్నారు. **ప్రజాశక్తి-కంకిపాడు :** ప్రపంచ మానసిక ఆరోగ్య అవగాహన వారోత్సవాల సందర్భంగా సోమవారం తాడిగడప జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయురాలు ఎన్. కనకదుర్గ సమగ్ర శిక్షా నుండి కెరీర్ గైడెన్స్ మానసిక ఆరోగ్య కౌన్సిలర్ దాక్షాయణి సంయుక్తంగా కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా, ప్రధానోపాధ్యాయురాలు ఎన్.కనకదుర్గ విద్యార్థులకు మానసిక ఆరోగ్య ప్రాధాన్యతను వివరించారు. అలాగే, 2025 సంవత్సరానికి సంబంధించిన ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవ థీమ్‌పై అవగాహన కల్పించారు. అనంతరం దాక్షాయణి ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, మానసిక ఆరోగ్యంపై ప్రభావం అనే అంశంపై విద్యార్థులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యకరంగా తినండి, లోతుగా శ్వాసించండి, ప్రశాంతంగా నిద్రించండి, దయతో ఆలోచించండి అనే ట్యాగ్‌లైన్‌తో కార్యక్రమాన్ని ముగించారు.



కంకిపాడు మండలంలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-పామర్రు : పేద వర్గాల సంక్షేమమే ధ్యేయంగా మానవత సేవ సంస్థ సమాజంలో సేవలు అందిస్తోందని పామర్రు మానవత అధ్యక్షులు ఎన్. త్రివిక్రమరావు పేర్కొన్నారు. పామర్రు లో ఎల్ఐసి ఏజెంట్ జన్యావుల వెంకటేశ్వరరావు పుట్టినరోజు సందర్భంగా వారి కుటుంబ వితరణతో సోమవారం పదిమంది పేదలకు నూతన వస్త్రాలు మానవతవారు పంపిణీ చేశారు. మానవత ప్రతినిధులు సీతాల ప్రసాద్, పి ఎం ఎస్ ప్రసాద్, సోమవ రపు రామారావు, అల్లాడ సోమశేఖర్, బొండు సుధాకర్, మద్దిరాల ప్రభాకర రావు, వెంకటరావు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు : ఎస్ఐ

ప్రజాశక్తి-చల్లపల్లి : దసరా ఊరేగింపుల్లో ముందస్తు అనుమతి లేకుండా డిజేలు పెట్టి ప్రజలను ఇబ్బం దులకు గురిచేస్తే చర్యలు తీసుకుంటామని చల్లపల్లి ఎస్ఐ వి. సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఊరేగింపుల్లో అనుమతి తీసుకున్న ప్రకారం డీజేలు, మైకులు పెట్టుకోవాలని, అలా కాకుండా కొన్నిచోట్ల పరిమితికించి డీజే లు పెట్టి ప్రజలను ఇబ్బందిలకు గురి చేస్తున్నారని అన్నారు. ఊరేగింపుల్లో ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని, డీజేలు పేరుతో అలజడి సృష్టించడం సరికాదన్నారు. చల్లపల్లి మండలం యార్లగడ్డలో. నిబంధనలను అతిక్రమించడంతోపాటూ అనుమతుల గురించి ప్రశ్నించిన పోలీస్ సిబ్బందిపై దురుసుగా ప్రవర్తించి విధులకు ఆటంకంకలిగించిన వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాణాసంచా దుకాణాలు తనిఖీ

ప్రజాశక్తి - గుడివాడ : బాణాసంచా విక్రయ దుకా ణాల తనిఖీలు నిర్వహించి, నేల టపాసులు తయారు చేస్తూ గతంలో కేసులు ఉన్న 20 మందిపై బైండోవర్ కేసులు నమో దు చేసినట్లు తాలుకా

ఎస్ఐ ఎన్.చంటి బాబు తెలిపారు. సోమవారం రూరల్ మండలంలోని బాణాసంచా దుకాణాలను రూరల్ ఎస్ఐ చంటిబాబు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొమ్ములూరు గ్రామంలో గతంలో కేసులు ఉన్న 20 మందిని ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున 20 మందిని 20 లక్షలకు గుడివాడ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ వద్ద బైండోవర్ చేశామన్నారు. అక్రమంగా బాణాసంచా విక్రయాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

సమస్యలు పరిష్కరించాలని విఓఎల వినతి

ప్రజాశక్తి- కలెక్టరేట్ (కృష్ణా) : వివోఏల సమస్యలు పరిష్కరిం చాలని కోరుతూ వివోఏల సంఘం ఆధ్వర్యంలో సోమవారం డిఆర్‌డిఏ పిడి హరిహరనాథ్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం వెలుగు వివోఏల సంఘం మచిలీపట్నం మండల అధ్యక్షురాలు వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ 5జి మొబైల్ ఇచ్చేవరకు ఆన్లైన్ వర్క్స్ చేయలేమన్నారు. వివోఏల సమస్యలు పరిష్కరించాలని గత కొంతకాలంగా ప్రభుత్వ అధికారులకు అనేకసార్లు వినతి పత్రాలు ఇచ్చిన సమస్యలు పరిష్కరించలేదన్నారు. 5జి మొబైల్ ఇవ్వకుండ కింది స్థాయిలో ఆన్లైన్ వర్క్స్ చేయలేదని వేధింపులు గురి చేస్తున్నారని ప్రతి మనిషికి టార్గెట్ ఇచ్చే ఒత్తిడి పెంచుతున్నారన్నారు. అలాగే ప్రతినెల వేతనాలు చెల్లింపులు జరగటం లేదని ప్రభుత్వం తక్షణం స్పందించి సమస్యలు పరిష్కరించాలని ఆమె డిమాండ్ చేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో వివిధ కసర్ల నుండి వెలుగు కార్యకర్తలు ,మరియు మచిలీపట్నం సిఐటియు కన్వీనర్ సిహెచ్ జయరావు లు ఉన్నారు.

'మనకోసం' ట్రస్ట్‌కు విరాళం

ప్రజాశక్తి-చల్లపల్లి : చల్లపల్లి మాజీ సర్పంచ్ వరదా రామారావు ఆరవ వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి వరదా హరి గోపాల్ మనకోసం మనం ట్రస్ట్‌కు విరాళం సోమవారం అందించారు. పది వేల రూపాయల విరాళంను స్వచ్ఛ సుందర చల్లపల్లి రథసారధి, డాక్టర్ డిఆర్‌కే ప్రసాద్‌కు అందించారు.

సూపర్ జిఎస్‌టి సూపర్ సేవింగ్స్‌పై కరపత్రాల పంపిణీ

ప్రజాశక్తి- నందిగామ

నందిగామలో సూపర్ జిఎస్‌టి సూపర్ సేవింగ్స్ కార్యక్రమంపై సోమవారం ప్రచారం నిర్వహించారు. వ్యాపారస్తులకు జిఎస్‌టి సంబంధిత ప్రయోజనాలు, సేవింగ్స్ వివరాలు తెలిపే కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య వ్యాపారులతో మాట్లాడుతూ ప్రభుత్వం వ్యాపారుల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో నందిగామ మున్సిపల్ చైర్ పర్సన్ మండవ కృష్ణకుమారి, ఆర్‌డిఒ బాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్ లోవరాజ్, తదితరులు పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

రాష్ట్రంలోని ప్రజల ఆరోగ్యానికి తమ కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు. సోమవారం ఉదయం తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే కార్యాలయంలో వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి (సిఎంఆర్‌ఎఫ్) నుంచి మంజూరైన రూ.11 లక్షల 25 వేలు విలువైన చెక్కులను ఎమ్మెల్యే గద్దె రామమోహన్ స్వయంగా లబ్ధిదారులకు అందచేశారు. ప్రజలు సిఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోవాలంటే తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పిజిఆర్‌ఎస్ తనిఖీలకు కమిటీ ఏర్పాటు

- ధ్యానచంద్ర ఆదేశం

ప్రజాశక్తి-విజయవాడ : ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి లక్ష్మీశ ఆదేశాల మేరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహణపై విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని జోనల్ కార్యాలయాలు, సచివాలయాల్లో ఆకస్మికంగా తనిఖీ నిర్వహించేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహణపై ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి జోనల్ కార్యాలయాలు, సచివాలయాల్లో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికల్లో ప్రజల నుండి అధికారులు స్వీకరిస్తున్న దరఖాస్తులు, వాటికి వారు చూపుతున్న పరిష్కారం, ప్రజలతో వాళ్ళు వ్యవహరిస్తున్న పనితీరు వంటి అంశాలపై ఈ కమిటీ పరిశీలించాలని కమిషనర్ అన్నారు.

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో పురోగతికి బాటలు

- కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : ప్రపంచ వ్యాప్తంగా మారుతున్న సమాజానికి అనుగుణంగా శాస్త్ర, సాంకేతిక రంగాల్లో మరింత అభివృద్ధి, పురోభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాటలు వేస్తున్నాయని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ తెలిపారు. కృష్ణా జిల్లా పామర్రు నియోజకవర్గానికి చెందిన టిడిపి నేత, తానా కార్యదర్శి మందలపు రవి రాష్ట్ర సైన్స్ అండ్ టెక్నాలజీ చైర్మన్‌గా విజయవాడ భవానీపురం పున్నమి ఘాట్‌లోని హరిత రిసార్ట్‌లో సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. ముఖ్యఅతిథిగా భూపతిరాజు శ్రీనివాసవర్మ హాజరై మాట్లాడుతూ.. నేటి డిజిటల్ యుగంలో యువత కొత్త టెక్నాలజీని అందుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. టెక్నాలజీని అన్వయించుకుంటూ, నేర్చుకుంటూ, నిపుణత సాధించటం ద్వారానే వాటి ఫలాలను అందుకోగలమని తెలిపారు. రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ.. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో మరింతగా పరిశోధనలు పెరగాల్సిన అవసరముందని పేర్కొన్నారు. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. టెక్నాలజీని నేర్చుకుంటేనే రాబోయే రోజుల్లో ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ సాగునీటి పారుదల రంగంలో అధునాతన టెక్నాలజీని వాడేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఏలూరు ఎపి పుట్టా మహేష్, ఎమ్మెల్సీ బలిశెట్టి రాధాకృష్ణ, ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాసరావు, సొంగా రోషన్‌కుమార్, బడేటి రాధాకృష్ణ, సిరి బాలరాజు, నాయకర్ బొమ్మిడి, ప్రత్తిపాటి పుల్లారావు, మద్దిపాటి వెంకటరాజు, ఆప్కాబ్ చైర్మన్ గన్ని ఆంజనేయులు, ఎపిఐఐసి చైర్మన్ రామరాజు, రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బోరగం శ్రీనివాసులు, పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు తదితరులు పాల్గొన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మందలపు రవి మాట్లాడుతూ రాష్ట్రంలో శాస్త్ర, సాంకేతిక రంగాల్లో మరింత అభివృద్ధి సాధించటానికి, మెరుగైన పరిశోధనా ఫలితాలు రావటానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

ప్రమాణస్వీకారోత్సవంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ

నాగిరెడ్డి జీవితం పలువురికి ఆదర్శం

- సంస్మరణ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాబూరావు

విజయవాడ : సిపిఎం సీనియర్ నాయకులు వనిపెంట నాగిరెడ్డి జీవితం పలువురికి ఆదర్శమని పలువురు వక్తలు పేర్కొన్నారు. 63వ డివిజన్ సుందరయ్య నగర్ సిపిఎం సీనియర్ నాయకులు వనిపెంట నాగిరెడ్డి సంస్మరణ సభ సోమవారం జరిగింది. తొలుత నాగిరెడ్డి చిత్రపటానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు, సిపిఎం సెంట్రల్ సిటీ కార్యదర్శి బి రమణారావు, సిపిఎం సెక్రటేరియట్ సభ్యులు కె దుర్గారావు, టి ప్రవీణ్, నగర కమిటీ సభ్యులు యు శివలింగేశ్వరరావు, ఎస్.కె పీర్ సాహెబ్, సిపిఎం డివిజన్ కార్యదర్శి బొంగు రాంబాబు, నాగిరెడ్డి సోదరుడు గురవారెడ్డి, నాయకులు పి జగన్, ఎస్‌డి మునాఫ్ పటేల్ తదితరులు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం సిపిఎం సీనియర్ నాయకులు పి సాంబిరెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో బాబురావు మాట్లాడుతూ.. 1980లో కృష్ణలంక భ్రమరాంబపురం నుండి ఇళ్ల తొలగించి రాజీవ్ నగర్ ఏరియాలో పునరావాసం కింద ఇచ్చినప్పటి నుండి ఈ ప్రాంత సమస్యలపై నిరంతరం పోరాడుతూ ఈ ప్రాంతానికి పుచ్చలపల్లి సుందరయ్య పేరు నామకరణం చేయడంలో ముఖ్యులని తెలిపారు. సుందరయ్య నగర్ ప్రాంత నివాసులకు ఇళ్లకు పట్టాలు మంచినీటి సౌకర్యం కల్పించాలని జరిగిన ఆందోళనలో ముఖ్యమైన పాత్ర పోషించారన్నారు. ముఠా కార్మికునిగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించి సుందరయ్య నగర్ స్థానిక నాయకునిగా చివరి వరకు పనిచేశారని తెలిపారు. తన అనారోగ్యాన్ని కూడా లెక్కచేయకుండా ప్రజా సమస్యలపై పోరాడారని తెలిపారు. నాగిరెడ్డి భౌతికంగా లేకపోయినా ఆయన చేసిన త్యాగాలు నిబద్ధతతో, పట్టుదలతో చేసిన కృషి భావితరాలకి ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు.

రావిరాలలో ఎమ్మెల్యే పర్యటన

ప్రజాశక్తి జగ్గయ్యపేట: మండలంలోని జయంతిపురం పంచాయతీ పరిధిలోని రావిరాల గ్రామాన్ని సోమవారం ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) సందర్శించారు. ఈ సందర్భంగా కృష్ణ నది ఒడ్డున అధిక వర్షాల కారణంగా ఏర్పడిన నది ఒడ్డు కోత సమస్యను పరిశీలించి రిటైనింగ్ వాల్ నిర్మాణం చేయాలని ఇరిగేషన్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌ను ఆదేశించారు. గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించడానికి వేదాద్రి స్కీమ్ నుండి రావిరాల, జయంతిపురం గ్రామాలకు పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని ఆర్డబ్ల్యూఎస్ డిప్యూటీ ఇంజనీర్‌కు సూచించారు. బీసీ, ఎస్సీ కాలనీల్లో కరెంట్ స్తంభాలు ఏర్పాటు చేసి కండక్టర్ లైన్ వేయాలని జగ్గయ్యపేట ఎలక్ట్రికల్ ఎడిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటిలో కలుస్తున్న ఎన్‌టిటిపిఎస్ బూడిద

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం: విటిపిఎస్ ఏర్పాటుకు ఇబ్రహీంపట్నం కొండపల్లి, మూలపాడు, తుమ్మలపాలెం, గుంటుపల్లి, ఈలప్రోలు తదితర గ్రామాల ప్రజలు సహకారం అందించి తమ పొలాలను సైతం ధారాదత్తం చేశారు. తమ భవిష్యత్ తరాలు బాగుపడతాయన్న ఉద్దేశంతో ఆనాడు రైతులు ముందుకొచ్చి విటిపిఎస్ ఏర్పాటుకు సహకరించారు. నేడు ఎన్‌టిపిఎస్ యాజమాన్యం తమ స్వార్థ ప్రయోజనాల కోసం స్థానిక ప్రజలను బలి కోరటానికి సిద్ధపడటం దుశ్చర్యని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇబ్రహీంపట్నంలోని డాక్టర్ నార్ల తాతారావు తాప విద్యుత్ కేంద్రం నుండి వెలువడుతున్న బూడిద విషాన్ని మైలవరం నియోజకవర్గంలోని గ్రామాలన్నిటికీ సరఫరా అయ్యే మంచినీరు, బుడమేరు డైవర్షన్ కెనాల్‌లో నింపింది. గత 40 రోజులుగా బూడిద చెరువులో టెండర్ విషయంలో వెనక్కి తగ్గమంటూ బూడిద లారీల యాజమాన్యం నిరసన తెలుపుతున్న నేపథ్యంలో బూడిద లోడింగ్ ఆగిపోయింది. దీంతో చేసేదిలేక ఎన్‌టిపిఎస్ యాజమాన్యం బూడిదను బుడమేరు డైవర్షన్ కెనాల్‌లో కలపడంతో కృష్ణానది పరివాహక ప్రాంతం మొత్తం బూడిద భయంగా మారింది. దీంతో ఆర్డబ్ల్యూఎస్ పంప్ హౌస్ నిండా బూడిద నిండిపోవడంతో నియోజకవర్గంలోని గ్రామాలకు మంచినీటి సరఫరా లేకుండా పోయింది. తాగే నీటిలో బూడిద కలవడంతో స్థానిక ప్రజలు తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని జీవించాల్సిన దుస్థితి దాపురించింది. కృష్ణా ప్రవాహంలో కలిసిన బూడిద విషం స్థానికులకే కాకుండా స్థానికేతరులకు ముఖ్యంగా విజయవాడ, అమరావతి తదితర కృష్ణా పరివాహక ప్రాంతంలో ప్రభావం చూపనుంది. ప్లాంట్ అధికారుల స్వార్థ ప్రయోజనాలకు ప్రజల ప్రాణాలు బలి కావలిసిందేనా అంటూ స్థానికులు మండిపడుతున్నారు. ఈ నిర్లక్ష్య, నిరంకుశ వైఖరి పట్ల పొల్యూషన్ బోర్డ్ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించటంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బూడిద కాలుష్యంపై జోగి రమేష్ నిరసన

ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమంలో డాక్టర్ ఎన్‌టిటిపిఎస్ బూడిద మంచినీళ్లల్లో కలపడంపై సోమవారం మాజీ మంత్రి జోగి రమేష్ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీటీపీఎస్ అధికారులు ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ బూడిద అమ్ముకుంటే వచ్చే డబ్బు మీద ఉన్న ప్రేమ, స్థానిక ప్రజానీకంపై లేదని ఎద్దేవా చేశారు. కాలుష్య కోరల్లో చిక్కుకున్న గ్రామాల ప్రజలకు సిఎం చంద్రబాబు నాయుడు, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

ఆర్‌డబ్ల్యుఎస్ పంప్ హౌస్ పరిశీలన

ఆర్ డబ్ల్యు ఎస్ మైలవరం పైలెట్ ప్రాజెక్ట్ హెడ్ వర్క్స్ పంప్ హౌస్ దగ్గర ధర్మల్ బూడిద నీరు కలిసిన కూలింగ్ కెనాల్‌ను సిపిఎం జిల్లా నాయకులు సిహెచ్ కోటేశ్వరరావు పరిశీలించారు. ప్లాంట్ అధికారుల స్వార్థ ప్రయోజనాల కోసం ప్రజల ప్రాణాలను పణంగా పెడుతున్నారని తెలిపారు. బూడిదతో కలుషితమైన నీటిని చూసి ఆవేదన చెందారు.

మీకోసం అర్జీల పరిష్కారంపై అవగాహన ఉండాలి : కలెక్టర్

వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : ప్రజలు సమర్పించే మీకోసం అర్జీల పరిష్కార విధానంపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులకు సూచించారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ సమావేశ హాలులో జాయింట్ కలెక్టర్ ఎం నవీన్, సహాయ కలెక్టర్ ఫర్హీన్ జాహిద్, డిఆర్ఓ కే చంద్రశేఖరరావు, అదనపు ఎస్పి సత్యనారాయణ, కే ఆర్ ఆర్ సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, బందరు ఆర్డిఓ కే స్వాతితో కలిసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమం నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ముందుగా ఆయన మీకోసం పెండింగ్ దరఖాస్తులపై సమీక్షించారు. భూ రికార్డులు ల్యాండ్ సర్వే, రహదారులు భవనాలు శాఖలకు సంబంధించి అర్జీలు అత్యధికంగా పెండింగ్లో ఉన్నాయన్నారు. వాటిపై ప్రత్యేక దృష్టి సారించి, పెండింగ్లో ఉంచకుండా నిర్ణీత సమయానికి పరిష్కరించాలని కలెక్టర్ ఈ సందర్భంగా అధికారులకు సూచించారు.

అర్జీలు పరిష్కరించడంపై అవగాహన

మీకోసం కార్యక్రమంలో ప్రజలు సమర్పించే అర్జీలను పరిష్కరించే విధానం, వాటిని ఆన్లైన్లో సమర్పించే ప్రక్రియపై జిల్లా కలెక్టర్ అధికారులకు వివరించారు. ప్రత్యేకంగా స్క్రీన్ పై పిజిఆర్ఎస్ ఆన్లైన్ పోర్టల్ ను ప్రదర్శించి అర్జీలను సరైన రీతిలో ఎండార్స్మెంట్ చేయవలసిన ప్రక్రియను వివరించారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జిఎస్‌టి ప్రయోజనాలు ప్రజలకు అందేలా చర్యలు చేపట్టాలని వినతి

జిఎస్టి తగ్గింపుల వలన ఏర్పడిన ప్రయోజనాలు ప్రజలకు అందేలా ఆదేశాలు జారీ చేయాలని సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ డికె బాలాజీ కి వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర, లోకల్ స్థాయిలపై జి.ఎస్.టి. విధానంలో కొన్ని మార్పులు, తగ్గింపులు జరిగాయని, ఈ తగ్గింపుల వల్ల అనేక వస్తువులు, సేవలకు ధరలు తగ్గడం జరిగిందన్నారు. కానీ, ఈ తగ్గింపు ప్రయోజనాలు ప్రజలకు సరిగ్గా అందడం లేదన్నారు. వాణిజ్య దుకాణాలు, హోటళ్ల దగ్గర బోర్డులు పెడుతూ జిఎస్టి తగ్గింపుల వివరాలు ప్రజలకు తెలిసేలా చర్యలు తీసుకుని ప్రజలకు ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సిపిఎం నగర కార్యదర్శి బూర.సుబ్రమణ్యం, సభ్యులు సి హెచ్.జయరావు, టి.చంద్ర పాల్, బెనర్జీ లు తదితరులు ఉన్నారు.

నేడు 'ట్రంప్ సుంకాల ఆంక్షలు- భారతదేశంపై ప్రభావం'పై సదస్సు

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి: 'ట్రంప్ సుంకాల ఆంక్షలు-భారతదేశంపై ప్రభావం' అంశంపై సదస్సును మచిలీపట్నం బుట్టాయిపేట జ్యోతిబాపూలే విజ్ఞాన కేంద్రంలో మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహిస్తున్నట్లు విజ్ఞాన కేంద్రం కన్వీనర్ మాదల వెంకటేశ్వరరావు తెలిపారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్ పాల్గొంటారని, సదస్సును జయప్రదం చేయాలని కోరారు.

మండల స్థాయి జట్ల ఎంపిక

ప్రజాశక్తి-ఉయ్యూరు : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉయ్యూరు మండల స్థాయి టోర్నమెంట్ కమ్ సెలక్షన్స్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం నిర్వహించారు. ఎంఈఓ-2 దుర్గా సాగర్ ముఖ్య అతిథిగా హాజరై సెలక్షన్స్ ప్రారంభించారు. అండర్-17 బాలుర వాలీబాల్ టీమ్కు జి.చాణక్య, పి.సజన్, టి.ప్రమోద్, వి. కళ్యాణ్, వి.హరిభాస్కర్, బి.కిరణ్, పి. అభిరామ్, కె.మరియదాస్, ఎం. యశ్వంత్, జి. సుదర్శన్, డి. జయప్రకాశ్, టి.సుశాంత్, ఎంపిక కాగా స్టాండ్బైగా ఎం. తివిక్రమ్, ఎస్. అజయ్కుమార్, బి.యువరాజు ఎంపికయ్యారు. అండర్-17 బాలికల జట్టుకు జి.గీతశ్రీ, కె. సైలు, ఆర్. లాస్య, టి.హరిక, పి.ఖతీజ, బి.నవీనశ్రీ, ఎండి సన, బి.భాను, ఆర్. జెస్సిక ఎంపికయ్యారు.అండర్-14 బాలుర జట్టుకు బి.సాత్విక్, జి. సుజన్, పి. కరీమాఖాన్, డి.మహిధర్, డి.రాజేశ్ డి.రవికుమార్, ఇ.భార్గవ్ టి.ప్రణీత్, బి.దీపక్, బి. ధనుష్, కె. అభి ఎంపికయ్యారు. అండర్ 14 బాలికల జట్టుకు జి.విద్యనాగదుర్గ, ఎస్కె. గౌరిమ, కె.దివ్యశ్రీ, ఎస్కె. షర్మానా, ఎన్.భార్గవి, ఆర్.సుప్రియ, లక్ష్మీసామ్రాజ్యం ఎంపికయ్యారు. ఉయ్యూరు హెచ్ఎం టి. వెంకటనాగేశ్వరరావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ సాయి, మండల ఎస్ఎఫ్ కోఆర్డినేటర్ కె. బాలస్వామి, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిపిఎం పోరాటంతో రోడ్డు పనులు ప్రారంభం

పనులను పర్యవేక్షిస్తున్న సిపిఎం కార్యకర్తలు

ప్రజాశక్తి-మైలవరం : సిపిఎం పోరాటంతో ఎట్టకేలకు అధ్వాన్నంగా ఉన్న ఆర్ అండ్ బి రహదారి పనులను సోమవారం సాయంత్రం అధికారులు ప్రారంభించారు. గత 8 నెలలుగా మైలవరం నుండి నూజివీడు వెళ్లే రహదారి పలుచోట్ల పెద్దపెద్ద గుంతలు పడడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గుంతలో పడి ప్రమాదాలు కూడా చోటు చేసుకున్నాయి. ఈ సందర్భంలో సిపిఎం అనేకసార్లు రహదారికి మరమ్మత్తులు చేయాలని పోరాటాలు చేసింది. ఆ పోరాటాల ఫలితంగా టెండర్ ప్రక్రియను పూర్తి చేసిన అధికారులు సోమవారం సాయంత్రం రహదారి పనులు ప్రారంభించారు. సిపిఎం కార్యకర్తలు ఎస్ అనిల్, ఎస్ శివకృష్ణ పనులను పర్యవేక్షించారు. సిపిఎం పోరాట ఫలితంగానే రహదారికి మోక్షం కలిగిందని వెల్లడం, చంద్రాల గ్రామస్తులతోపాటు పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జిఎస్టి రేట్ల తగ్గింపుపై అవగాహన

ప్రజాశక్తి-కంకిపాడు : ప్రభుత్వం నిర్వహిస్తున్న జిఎస్టి రేట్ల తగ్గింపు అవగాహన కార్యక్రమంలో భాగంగా పెనమలూరు శాసనసభ్యులు బోడే ప్రసాద్ ఆధ్వర్యంలో తాడిగడప పట్టణ పరిధిలోని జిమ్ములు, సెలూన్లు, స్పా సెంటర్లు, యోగా సెంటర్లలో జిఎస్టి రేట్లు తగ్గడం వల్ల జరిగిన ప్రయోజనం గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తాడిగడప మున్సిపల్ కమిషనర్ నజీర్, అసిస్టెంట్ కమిషనర్ డి కిరణ్ కుమార్, కమర్షియల్ టాక్స్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీమాధవి, సిబ్బంది పాల్గొన్నారు. **ప్రజాశక్తి-మైలవరం :** స్థానిక డాక్టర్ లక్కిరెడ్డి అనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామర్స్ విభాగం ఆధ్వర్యంలో జిఎస్టి సూపర్ సేవింగ్స్‌పై సోమవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఇల్లా రవి, కామర్స్ విభాగాధిపతి ఎం శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ రంగారావు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్ కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

ధోబీ ఘాట్ స్థలంలో అక్రమ కట్టడాలు నివారించాలని వినతి

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు మల్లమ్మ చెరువు సమీపంలోని సాయిరాఘవ రియల్ ఎస్టేట్ వెంచర్లో ప్రభుత్వం దోబి ఘాట్ నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని ఆక్రమించుకుని అక్రమ కట్టడాలు నిర్మిస్తున్న వారిపై చర్యలు తీసుకుని ఆ స్థలానికి రక్షణ కల్పించాలని రజక సంఘం నాయకులు నగర పంచాయతీ కమిషనర్ మనోజకు సోమవారం ఫిర్యాదు చేశారు. 2004లో అప్పటి మేజరు పంచాయతీ సర్పంచ్ ఉయ్యూరు అనసూయ అధ్యక్షతన జరిగిన పంచాయతీ బోర్డు సమావేశంలో సాయిరాఘవ రియల్ ఎస్టేట్ వెంచర్లో ఉన్న కమ్యూనిటీ స్థలాల్లో 6.50 సెంట్ల స్థలాన్ని రజకులకు ధోబిఘాట్ నిర్మాణానికి కేటాయిస్తూ తీర్మానం చేశారని తెలిపారు. ప్రభుత్వం కేటాయించిన నిధులతో అర్బ్యూఎస్ అధికారులు ధోబీ ఘాట్ నిర్మాణ క్రమంలో రెండు బోరు బావులు ఏర్పాటు చేశారన్నారు. కాంక్రీట్ సిమెంట్ ఫారం, నీటి కట్టులు కూడా నిర్మించారని వెల్లడించారు. పూర్తిస్థాయిలో ధోబి ఘాట్ నిర్మాణం జరగకపోవడంతో వెంచర్ యజమాని వేమూరి కనకదుర్గ ప్రసాద్ ఆ స్థలానికి అక్రమ రిజిస్ట్రేషన్ చేసి ప్రభుత్వ ఆస్తిని అమ్ముకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, దీనిపై విచారణ జరిపి సంబంధిత వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని, ధోబీఘాట్‌ను నిర్మించాలని రజక సంఘం నాయకులు ముదిగొండ దుర్గాప్రసాద్ కమిషనర్‌కు అందజేసిన వినతిపత్రంలో పేర్కొన్నారు.

దుర్గగుడి హుండీ ఆదాయం రూ.3.57 కోట్లు

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : దుర్గగుడి హుండీల లెక్కింపు కార్యక్రమం సోమవారం కట్టుదిట్టమైన భద్రత నడుమ నిర్వహించారు. ఆలయ ఇఒ శీనా నాయక్ పర్యవేక్షణలో కనకదుర్గ నగర్ మల్లికార్జున మహా మండపం ఆరో అంతస్తులో దసరా ఉత్సవాల సందర్భంగా యాత్రికులు సమర్పించిన కానుకల హుండీల లెక్కింపు కొనసాగింది. దసరా సందర్భంగా మొదటి విడతగా రూ.3,57,92, 708 కోట్ల నగదుతోపాటు బంగారం 122 గ్రాములు, 9.700 కిలోల వెండి లభించింది. వీటితోపాటు పలు దేశాల విదేశీ కరెన్సీని యాత్రికులు హుండీలలో సమర్పించినట్లు వెల్లడించారు. కాగా, దసరా ఉత్సవాలు 2వ తేదీతో ముగిసినా సోమవారం నాడు ఇంద్రకీలాద్రిపై భవానీల రద్దీ ప్రభావం కొనసాగింది. దసరా ఉత్సవాల సందర్భంగా సుమారు 16 లక్షల మంది యాత్రికులు ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను దర్శించుకున్నారని అధికారులు పేర్కొన్నారు. ఉత్సవాల అనంతరం భవానీ దీక్ష విరమణదారుల రద్దీ

కొనసాగిందని తెలిపారు. 3వ తేదీ నుంచి 6వ వరకు అమ్మవారిని 4 లక్షల మంది భవానీలు, యాత్రికులు దర్శించుకున్నట్లు అధికారులు ప్రకటన విడుదల చేశారు. దసరా ఉత్సవాల సందర్భంగా మొత్తం 20 లక్షల మంది అమ్మవారిని దర్శించుకున్నట్లు అధికారులు అంచనా వేశారు. అమ్మవారి నెలవారీ కార్యక్రమాలలో భాగంగా ఈ నెల 7వ తేదీ ఉదయం గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. దుర్గగుడి ఘాట్ రోడ్డులోని కామదేనువు అమ్మ వారి ఆలయం నుంచి ప్రారంభమైన గిరి ప్రదక్షిణ కుమ్మరిపాలెం, సితార సెంటర్, కబేళా మీదుగా పాల ఫ్యాక్టరీ చిట్టినగర్ బ్రాహ్మణ వీధి గుండా ఇంద్రకీలాద్రికి చేరుకుంటుందని ఆలయ ఇఒ శీనా నాయక్ తెలిపారు.

ఐవిఎఫ్ పద్ధతిలో ఆవు దూడ జననం

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్ (ఐవిఎఫ్) పద్ధతిలో ఆవు దూడ జన్మించడం పట్ల జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ హర్షిస్తూ, ఇది జిల్లాకు ఎంతో గర్వకారణమని పశుసంవర్ధక శాఖ అధికారులను ప్రత్యేకంగా అభినందించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ సమావేశ హాలులో మీకోసం కార్యక్రమం అనంతరం జిల్లా కలెక్టర్ ఈ విషయాన్ని ప్రకటించారు. మొవ్వ మండలం, చినముత్తేవి గ్రామంలో జొన్నలగడ్డ హనుమకుమార్ కు చెందిన ఆవుకు ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్ (ఐవిఎఫ్) పద్ధతిలో ఆవు దూడ జన్మించిందని తెలుసుకున్న జిల్లా కలెక్టర్ వారిని అభినందించారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఎన్ చిన నరసింహులు ఆ వివరాలను వెల్లడిస్తూ పశు పరిశోధన స్థానం, లాం ఫారం, గుంటూరులో గల పిండోత్పత్తి ప్రయోగశాలలో మేలు జాతి గిర్, ఒంగోలు ఆవు నుండి అండాలు సేకరించి వాటిని ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్ మేలు జాతి ఆబోతు వీర్యంతో ఫలదీకరణ చేసి ఏడు రోజులు ప్రయోగశాలలో శాస్త్రీయ విధానం లో పిండాలుగా మార్పు ద్రవ నత్రజనిలో భద్రపరిచామన్నారు. ఆవు ఎదకు వచ్చిన ఏడవ రోజు భద్రపరిచిన పిండాన్ని ఆవు గర్భంలో ప్రవేశ పెట్టడం జరిగిందని, 9 నెలల అనంతరం మగ ఆవు దూడ జన్మించిందని తెలిపారు.

సిఐటియు ఎన్‌టిఆర్ జిల్లా మహాసభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లిలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో అక్టోబర్ 12, 13వ తేదీలలో జరుగు సిఐటియు ఎన్టిఆర్ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఇబ్రహీంపట్నంలోని సిఐటియు కార్యాలయంలో సోమవారం మహాసభ పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎన్‌సిహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ నిరంతరం కార్మికుల కోసం పనిచేస్తున్న సిఐటియు మహాసభలు కొండపల్లిలో నిర్వహించడం జరుగుతుందని, ఈ సభలకు 300 మందికిపైగా ప్రతినిధులు హాజరు కాబోతున్నారని తెలిపారు. మహాసభలో గత మూడు సంవత్సరాల కార్మిక ఉద్యమాలపై చర్చ జరుగుతుందని, కార్మిక హక్కులను కాలరాసేందుకు పని గంటలు పెంచుతున్న పాలక ప్రభుత్వాలపై పోరాటాలు కొనసాగించేందుకు భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తుందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను హరిస్తున్నాయన్నారు. కార్పొరేట్ కబంధ హస్తాల్లో కార్మికులను కట్టు బానిసలుగా మార్చే 13 గంటల పని విధానం తీసుకురావడం చట్ట విరుద్ధమన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు సీనియర్ నాయకులు ఎ విఠల్‌రావు, సిఐటియు మండల కార్యదర్శి ఎం మహేష్, ఉపాధ్యక్షులు ఇ కొండలరావు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి పి వీరయ్య, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు కె బుల్లెమ్మ, మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీ యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు కె రాజేశ్వరి, ఇ మంగమ్మ, విటిపిఎస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఎస్ పాపయ్య పాల్గొన్నారు.

పోస్టరు ఆవిష్కరిస్తున్న దృశ్యం

శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని వినతి

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: హిందూ శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలంటూ మండలంలోని షేర్ మహమ్మద్ పేట అడ్డరోడ్డులో నివసిస్తున్న గ్రామస్తులు సోమవారం ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య)కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ షేర్ మహమ్మద్ పేట అడ్డరోడ్డులో సుమారు 300 కుటుంబాలు నివాసముంటున్నాయని, గ్రామ పరిధిలో శాశ్వతమైన శ్మశానవాటిక లేకపోవడంతో అంత్యక్రియలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. శాశ్వతంగా హిందూ శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్పందిస్తూ గ్రామస్తుల సమస్యను తక్షణమే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని, సమీపంలో ప్రభుత్వ స్థలం అందుబాటులో ఉంటే దానిని శ్మశాన వాటికకు కేటాయిస్తామని, అవసరమైతే ప్రైవేటు స్థలాన్ని కొనుగోలు చేసి సాధ్యమైనంత త్వరలో శ్మశాన వాటికను ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే రాజగోపాల్ హామీతో గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

8న స్కూల్ గేమ్స్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: జిల్లా స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో జరుగే పోటీల్లో పాల్గొనేందుకు ఈ నెల 8న జగ్గయ్యపేట మండల స్కూల్ గేమ్స్ సెలక్షన్స్ పట్టణంలోని జీవీజే బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ చిట్టిబాబు, పీడీలు ఎం శ్రీనివాసరావు, ఎం నాగేశ్వరరావులు తెలిపారు. అండర్ -14, అండర్ -17 బాలురు, బాలికలకు వేరువేరుగా కబడ్డీ, వాలీబాల్, చెస్, యోగ, షటిల్, బ్యాడ్మింటన్, కోకో, అథ్లెటిక్స్ విభాగాల్లో సెలక్షన్స్ జరుగుతాయని, అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల బాల బాలికలు హాజరుకావాలని కోరారు.

రికార్డులు తనిఖీ

ప్రజాశక్తి - తిరువూరు : ఖరీఫ్ సీజన్‌లో రైతు సేవా కేంద్రాల సిబ్బంది, వీఆర్ఓలు పంట నమోదు చేసిన వివరాల రికార్డులను తహశీల్దార్ ఉదయ భాస్కరరావు, మండల వ్యవసాయ అధికారి పి.పద్మ సోమవారం పరిశీలించారు. పాత తిరువూరు రెవెన్యూ గ్రామ పరిధిలో పత్తి పంటల నమోదు రికార్డులను తనిఖీ చేశారు. రైతులు సాగు చేసే పంటల వివరాల నమోదులో తేడాలు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. రైతులందరూ ఈ క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని తెలిపారు.

ఉద్యోగ,పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-కంచికచర్ల : ప్రభుత్వం ఉద్యోగ,పెన్షనర్ల సమస్యలపై దృష్టిసారించి, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కంచికచర్ల శాఖ అధ్యక్షులు సానె రామ్మోహనరావు ప్రభుత్వాన్ని కోరారు. సంఘం సమావేశం కంచికచర్లలోని పెన్షనర్స్ సేవా భవన్‌లో జరిగిన సమావేశంలో సంఘం అధ్యక్షులు సానె రామ్మోహనరావు అధ్యక్షత వహించి మాట్లాడారు. ప్రభుత్వం ఉద్యోగ ,పెన్షనర్ల సమస్యలపై దృష్టి సారించి డిఎ, పిఆర్‌సి ప్రకటించాలని కోరారు. ఈ సమావేశంలో ట్రెజరర్ చలసాని నాగేశ్వరరావు, బివి సర్వేశ్వర రావు, కెవిబి రమణమూర్తి, వి ప్రసాద్ పాల్గొన్నారు. మాక్సీవిజన్ ఐ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ విజయవాడ వారు ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించి నలుగురిని కాటరాక్ట్ ఆపరేషన్‌కు ఎంపిక చేశారు.

రైతులకు శిక్షణ

ప్రజాశక్తి- నందిగామ : నందిగామ మండలం పల్లగిరి గ్రామంలో కెవికె ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎం రవి కిషోర్, శాస్త్రవేత్త శివప్రసాద్, మండల వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీకాంత్‌లు సోమవారం రైతులకు శిక్షణ నిర్వహించారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎం రవి కిషోర్ ప్రస్తుత పంటలలో తీసుకోవలసిన జాగ్రత్తలను, ఆచరించవలసిన పద్ధతులను వివరించారు. ప్రస్తుత పరిస్థితులలో రైతులు సమతుల్య ఎరువుల యాజమాన్య పద్ధతులను ఉపయోగించుకొని దిగుబడులలో వ్యత్యాసం లేకుండా చూసుకోవాలని వివరించారు. రైతు సోదరులు ఒక గ్రూపుగా ఏర్పడి కస్టమ్ హైరింగ్ సెంటర్స్‌ను, బయో రిసోర్స్ సెంటర్స్‌లను, విలువ ఆధారిత ఉత్పత్తులను వల్ల నికర ఆదాయం పెంపొందించుకోవడానికి ప్రయత్నించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ పి.ఎన్ శివ ప్రసాద్.. పంటలో ఎండు తెగులను తట్టుకొనుటకు ఉపయోగపడే తీరును రైతులకు వివరించి, తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో పల్లగిరి గ్రామ మాజీ సర్పంచ్ బిక్షాలు పాల్గొన్నారు.

రైతులు సహకరించాలి

ప్రజాశక్తి-గంపలగూడెం: గ్రామాల్లో జరుగుతున్న రీ సర్వే కార్యక్రమానికి ప్రతి రైతు హాజరై తన భూహక్కు పత్రాలను సర్వే అధికారులకు చూపించా లని గంపల గూడెం తహశీల్దార్ వడ్డేశ్వరపు రాజకుమారి కోరారు. సోమవారం మండలంలోని గోసవీడు కొనిజర్ల గ్రామాల్లో సభలు నిర్వహించి, రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాశీల్దార్, రైతులు పాల్గొన్నారు.

నందిగామ మున్సిపాలిటీలో వార్డుల పెంపు

- పారదర్శకంగా సాగిన ప్రక్రియ

ప్రజాశక్తి- నందిగామ : నందిగామ పాత బస్టాండ్ సెంటర్ బాబు జగ్జీవన్ రామ్ బిల్డింగ్‌లో మున్సిపాలిటీ అత్యవసర సమావేశం సోమవారం జరిగింది. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పాల్గొని నందిగామ మున్సిపాలిటీ వార్డుల విభజనపై కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం నందిగామ పట్టణం 7.28 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో సుమారు 54,830 మంది జనాభాతో ఉన్నారని తెలిపారు. వీరిలో 36,388 మంది ఓటు హక్కు కలిగి ఉన్నారని, నగర పంచాయతీ స్థాయి నుంచి ఇటీవల గ్రేడ్-2 మున్సిపాలిటీగా అభివృద్ధి చెందిన నందిగామలో ఇప్పటివరకు 20 వార్డులు ఉండగా, జనాభా పెరుగుదల దృష్ట్యా వీటిని 28 వార్డులుగా విభజించే ప్రతిపాదన ఆమోదం పొందిందని తెలిపారు. వార్డుల పెంపు ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వానికి అధికారికంగా సమర్పించనున్నట్టు ఆమె తెలిపారు. ఈ నిర్ణయంతో నందిగామ మున్సిపాలిటీ భవిష్యత్తు ఎన్నికలు 28 వార్డుల ఆధారంగా జరగనున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో నందిగామ మున్సిపల్ చైర్మన్ మండవ కృష్ణ కుమారి, కమిషనర్ లోవరాజు, వార్డు కౌన్సిలర్లు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

శానిటేషన్ కాంట్రాక్టర్ల మోసాలపై విచారించాలి

- సిపిఎం ఫ్లోర్ లీడర్ బోయి సత్యబాబు

కూలీలతో మాట్లాడుతున్న సత్యబాబు

ప్రజాశక్తి-విజయవాడ : దసరా నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా శానిటేషన్ పని చేసిన రోజు వారీ కూలీలకు సదరు కాంట్రాక్టర్లు కనీస వేతనం చెల్లించే విధంగా నగర కమిషనర్ ధ్యానచంద్ర తగిన చర్యలు తీసుకోవాలని సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు తెలిపారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం పరిధిలో ఉన్న శానిటేషన్ కూలీలను పరామర్శించిన సత్యబాబు... కార్మికుల ఇబ్బందులు, కాంట్రాక్టర్ల మోసాలను కార్మికులను అడిగి తెలుసుకున్నారు. మేస్త్రిల దగ్గర నుంచి కాంట్రాక్టర్ల వరకు అందరూ తమను మోసం చేస్తున్నారని, తమతో రెండు షిఫ్టులు పని చేయించుకొని కేవలం రూ.600 లోపు మాత్రమే కూలి చెల్లిస్తున్నారని, భోజనం, ఇతర సదుపాయాలు కల్పించలేదని, ఈ 16 రోజుల పాటు అనేక కష్టాలు పడి, గొడ్డు చాకిరి చేయాల్సి వచ్చిందని సత్యబాబు ఎదుట కార్మికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కూలి దగ్గర నుంచి అన్ని రకాలుగా తమను కాంట్రాక్టర్లు మోసం చేశారని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై సత్యబాబు మాట్లాడుతూ...సిపిఎం నిబంధనల ప్రకారం కాంట్రాక్ట్‌లో పేర్కొన్న విధంగా కనీస కూలి కార్మికులకు దక్కే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శానిటేషన్ కాంట్రాక్టర్ల మోసాల పట్ల అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. దసరా ఉత్సవాలకు నగరపాలక సంస్థ ద్వారా గత నెల 20 నుండి ఈనెల 05 తేదీ వరకు దసరా ఉత్సవాల సందర్భంగా నియమించబడిన శానిటేషన్ కార్మికులకు కనీస వేతనం అమలు జరపకుండా కాంట్రాక్టర్లు చేస్తున్న మోసాలను అరికట్టి కార్మికులకు కనీస వేతనం చెల్లించే విధంగా నగరపాలక సంస్థ అధికారులు తగు చర్యలు చేపట్టాలని కోరారు. నగరపాలక సంస్థ అధికారులు నిర్ణయించిన 8 గంటల పనికి రూ. 529 చెల్లించాల్సి ఉండగా, కేవలం రూ.300 మాత్రమే చెల్లిస్తూ, భోజన వసతి, అల్పాహారం, ఇవ్వకుండా కార్మికులను తీవ్ర అన్యాయం చేస్తున్నారని అన్నారు. ఇటువంటి మోసాలపై విచారించి, సదరు కాంట్రాక్టర్లు చేస్తున్న అవినీతి చర్యలపై అధికారులు వెంటనే స్పందించి, కార్మికుల జరుగుతున్న అన్యాయాన్ని నివారించాలని కోరారు.

పిజిఆర్ఎస్‌కు 182 అర్జీలు

ప్రజాశక్తి-విజయవాడ : ప్రజా సమస్యల పరిష్కార వేదికకు (పీజీఆర్ఎస్) వచ్చిన అర్జీదారులకు సంతృప్తికర పరిష్కారం చూపాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. అర్జీదారులతో సంబంధిత అధికారి మర్యాదగా ప్రవర్తించాలని, ఎండార్స్‌మెంట్ తప్పకుండా ఇవ్వాలని చెప్పారు. వ్యవహార శైలి, పరిష్కార విధానం సరిగా లేవన్న అభిప్రాయం అర్జీదారుల నుంచి ఎట్టిపరిస్థితిలోనూ రాకూడదని స్పష్టం చేశారు. రీ ఓపెన్ చేసిన ఫిర్యాదులపై ప్రత్యేకంగా దృష్టిసారించి, త్వరితగతిన పరిష్కరించాలని చెప్పారు. రెవెన్యూ అంశాలకు సంబంధించిన అర్జీల పరిష్కారంలో సంతృప్తి స్థాయిని పెంచాలన్నారు. సోమవారం జరిగిన జిల్లాస్థాయి పీజీఆర్ఎస్ కార్యక్రమంలో మొత్తం 182 అర్జీలు అందాయి. ఇందులో రెవెన్యూ విభాగంలో అత్యధికంగా 53, పోలీస్ 36, పురపాలక, పట్టణాభివృద్ధి 24, పంచాయతీరాజ్ 14, రవాణా 10, డీఆర్‌డీఏ 9, ఆరోగ్యశాఖ 6, పౌరసరఫరాలు, విభిన్న ప్రతిభావంతులు, దేవాదాయ శాఖ, విద్యాశాఖ, బ్యాంకులకు సంబంధించిన అర్జీలు మూడు చొప్పున, ఎక్సైజ్, మార్కెటింగ్, సర్వే శాఖలకు సంబంధించిన అర్జీలు రెండు చొప్పున, గనులు, భూగర్భ శాఖ, నీటిపారుదల, గృహ నిర్మాణం, గ్రామీణ నీటిసరఫరా, కార్మిక, ఉపాధి కల్పన, రిజిస్ట్రేషన్ - స్టాంపులు, నైపుణ్యాభివృద్ధి, డ్వామా శాఖలకు సంబంధించి ఒక్కో అర్జీ అందాయి. ఈ అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి నిర్దేశ గడువులోగా నాణ్యతతో పరిష్కరించాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు.

జిల్లాస్థాయి పీజీఆర్ఎస్‌కు 182 అర్జీలు

ప్రోత్సాహకాలు సద్వినియోగం చేసుకోవాలి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-నాగాయలంక : ప్రోత్సాహకాలు సద్విని యోగం చేసుకుని యానాదులు ఆర్థికంగా స్థిరపడాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పిలుపునిచ్చారు. సోమవారం నాగాయలంక మండలం నాలి గ్రామంలో ప్రజా ప్రగతి సేవా సంస్థ చైర్మన్ పరుచూరి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నాబార్డ్ వారి ట్రైబల్ డెవలప్మెంట్ ఫండ్ నిధులతో యానాదులు వేట వత్తిని మెరుగుపరుచుకునే కార్యక్రమంలో భాగంగా పలు సహాయాలు అందచేశారు. రూ.10 లక్షలతో నూతనంగా నిర్మించిన ఫీడ్ మేకింగ్ యూనిట్ ను ఎమ్మెల్యే ప్రారంభించారు. యానాదులు తమ చెరువుల్లో రొయ్యలు, పీతల పిల్లలు వేసుకునేందుకు అనువుగా రూ.లక్షన్నర వ్యయంతో మూడు సంఘాలకు సీడ్ యూనిట్స్ ఏర్పాటుకు సహకారం అందచేశారు. యానాదులు ఎండు చేపలు, ఎండు రొయ్యలు తయారు చేసుకునేందుకు అనువుగా రూ.50వేలు వ్యయంతో రెండు సంఘాలకు సోలార్ డ్రయర్లను అందచేశారు. యానాదులు వేట సాగించేందుకు అనువుగా ఐదు సంఘాలకు రూ.2.50 లక్షలు వ్యయంతో ఐదు బోట్లు మంజూరు చేసి సంబంధిత అనుమతి పత్రాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రగతి సేవా సంస్థ చైర్మన్ పరుచూరి వెంకటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షులు మెండు లక్ష్మణరావు (చంటి), సర్పంచులు నాయుడు బాలకష్ణ, మండలి ఉదయ భాస్కర్, ఎంపీటీసీ ధనుంజయ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి-మైలవరం : మైలవరం ఎక్సైజ్ స్టేషన్ సర్కిల్ పరిధిలో సోమవారం ఎక్సైజ్ అధికారులు ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. ములకల చెరువు కల్తీ మద్యం మూలాలు ఇబ్రహీంపట్నంలో ఉన్న నేపథ్యంలో తెలంగాణ సరిహద్దు గల మొరుసుమల్లి, పుల్లూరు, గంగినేని తదితర గ్రామాల్లో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. అనధికార మద్యం విక్రయాలు, వైన్ షాపుల్లో తనిఖీలు చేసినట్లు ఎక్సైజ్ మైలవరం సిఐ శ్రీనివాస్ తెలిపారు. ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో కల్తీ మద్యం లేకుండా అన్ని రకాల చర్యలు చేపట్టడం జరిగిందని పేర్కొన్నారు. అనధికార మద్యం ఎవరైనా విక్రయాలు చేస్తే 9959510446, 8919698019 ఫోన్ నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి-వీరులపాడు : మండలంలోని వీరులపాడు గ్రామంలో ముత్యాలమ్మ తల్లి గుడి శిథిలావస్థకు చేరడంతో గ్రామానికి చెందిన అద్దంకి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో గుడి నిర్మాణం చేపట్టి సోమవారం ముత్యాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జగన్మోహన్‌రావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. టిడిపి నాయకులు నల్లమల ఉమామహేశ్వరరావు, అద్దంకి స్వామి, పార్టీ మాజీ మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు పాటిబండ్ల జయపాల్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్లు : కలెక్టర్

కరపత్రిక ఆవిష్కరిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : ఖరీఫ్ సీజన్ కు సంబంధించిన పంటను జిల్లాలోని రైతు సేవ కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తామని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ సమావేశ హాలులో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఎం నవీన్, సహాయ కలెక్టర్ ఫర్హీన్ జాహిద్, డిఆర్ఓ కే చంద్రశేఖరరావు, అదనపు ఎస్పి సత్యనారాయణ, వ్యవసాయ శాఖ అధికారిణి ఎన్ పద్మావతి, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ టి శివరాం ప్రసాద్, జిల్లా పౌర సరఫరాల అధికారి జి మోహన్ బాబు, బందరు ఆర్డీఓ కే స్వాతితో కలిసి ఖరీఫ్ సీజన్ 2025-26 సంవత్సరానికి సంబంధించి రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు కరపత్రికను ఆవిష్కరించారు. నాణ్యత ప్రమాణాలు పాటించి తమ పంటకు మద్దతు ధర పొందాలని కలెక్టర్ రైతులను కోరారు. సాధారణ ధాన్యం రకం ఒక క్వింటాలుకు రూ.2,369, అదేవిధంగా 75 కేజీలకు రూ.1,792, ఏ గ్రేడ్ ధాన్యం రకం ఒక క్వింటాలుకు రూ.2,389, అదేవిధంగా 75 కేజీలకు రూ.1,777 పొందాలని రైతులను కోరారు. దీనితోపాటు గోనె సంచులు, లేబర్, రవాణా చార్జీల సైతం ప్రభుత్వం చెల్లిస్తుందని తెలిపారు. అవసరమైన సమాచారం కోసం రైతులు జిల్లా కంట్రోల్ రూమ్ నెంబర్ 8247693551 లేదా టోల్ ఫ్రీ నెంబర్ 1967లో సంప్రదించవచ్చని అన్నారు.

జనార్ధనపురం పోస్టాఫీస్ అడ్రస్ ఎక్కడ..?

ప్రజాశక్తి-నందివాడ : నందివాడ మండలం జనార్ధనపురం గ్రామంలో దాదాపు 70 సంవత్సరాలుగా ఒకే అడ్రస్ లో ప్రజలకు విస్తతమైన సేవలు అందించిన పోస్టల్ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరడంతో ఇటీవల కాలంలో వేరే ప్రాంతానికి మార్చారు. అయితే అడ్రస్సు మార్పు విషయమై ఏ విధమైన సూచికల బోర్డులు ఏర్పాటు చేయకుండా కార్యాలయం మార్పు జరిగింది. అయితే నిరక్ష్యరాసులు చాలామంది అడ్రస్ తెలియక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా మారిన అడ్రస్ అయినా స్పష్టంగా తెలుస్తోందా అంటే అదీలేదని, దగ్గరకు వెళ్లి చూస్తే గాని లోపల ఉన్న పోస్టల్ కార్యాలయం కనిపించని విధంగా ఉండటంతో మహిళలు, వద్ధులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నట్లు తెలుస్తోంది.

పోస్టుమాస్టర్ నిర్లక్ష్యపు సమాధానంతో ఇబ్బందులు

జనార్ధనపురం తపాలా కార్యాలయంలో పనిచేసే పోస్ట్‌మాస్టర్ ప్రజలకు అందిస్తున్న సేవల్లో ఓర్పు ఉండాల్సింది పోయి నిర్లక్ష్యం, ఆగ్రహంతో సమాధానం చెబుతున్నట్లు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆన్లైన్ పనిచేయడం లేదు అనే సాకుతో రోజుల తరబడ సేవలు నిలుపుదల చేయడం, వివరాలు అడిగితే ఇక్కడ అడగొద్దు గుడివాడ ప్రధాన కార్యాలయంలో చెప్పుకోమని ఉచిత సలహా ఇస్తున్నట్లు తెలుస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో ఓర్పుతో విధులు నిర్వహించాల్సిన పోస్ట్మాస్టర్ నిర్లక్ష్యపు సమాధానాలతో ప్రజలు ఇతర బ్యాంకుల సేవలకు తరలిపోతున్నట్లు తెలుస్తోంది.

రొమ్ము కేన్సర్‌పై అవగాహన అవసరం : కలెక్టర్

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : మహిళలలో అత్యంత సాధారణంగా కనిపించే రొమ్ము క్యాన్సర్ పై అవగాహన కలిగి ఉండాలని, అందుకు ప్రభుత్వం అందించే వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మహిళలను కోరారు. పింక్ అక్టోబర్ సందర్భంగా జిల్లా కలెక్టర్ సోమవారం మధ్యాహ్నం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ సమావేశపు మందిరంలో జాయింట్ కలెక్టర్ ఎం నవీన్, సహాయ కలెక్టర్ ఫర్హీన్ జాహిద్, డిఆర్ఓ కే చంద్రశేఖరరావు, అదనపు ఎస్పి సత్యనారాయణ, కే ఆర్ ఆర్ సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, బందరు ఆర్డిఓ కే స్వాతి, మచిలీపట్నం జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆశాలత తదితరులతో కలిసి రొమ్ము క్యాన్సర్ అవగాహన నెల గోడపత్రికను ఆవిష్కరించారు. మచిలీపట్నం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో అనుభవజ్ఞులైన శస్త్ర చికిత్స, క్యాన్సర్ వ్యాధి నిపుణులచే సోమవారం, గురువారం రోజులలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు రోగులను పరీక్షించి రోగనిర్ధారణ పరీక్షలు చేసి వైద్య సేవలు అందిస్తారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఈ సందర్భంగా మహిళలను కోరారు. మచిలీపట్నం జిజిహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, వైద్యులు డాక్టర్ జగదీష్, డాక్టర్ పద్మావతి, వైద్యులు పాల్గొన్నారు.

పెరటి కోళ్ల పెంపకంపై శిక్షణ

ప్రజాశక్తి- మోపిదేవి : ఆచార్య ఎన్.జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని బోడగుంటలో కృషి విజ్ఞాన కేంద్రం, ఘంటశాల వారు పెరటి కోళ్ల పెంపకంపై శిక్షణా కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా కెవికె సమన్వయ కర్త డా. సుధారాణి మాట్లాడుతూ తక్కువ శ్రమ తక్కువ పెట్టుబడితో పోషకాహారాన్ని అందించే రంగం పెరటి కోళ్ల పెంపకం అని తెలిపారు. మత్స్య శాస్త్రవేత్త జె. యశ్వంత్ కుమార్ మాట్లాడుతూ నాటుకోడి గుడ్లలో ఎన్నో పోషక విలువలు ఉన్నాయని, ప్రతి కుటుంబం పెరటి కోళ్ల పెంపకం చేపట్టాలని కోరారు. పెరటిలో పెంచుకోవడానికి అనువైన, పెరటి కోళ్ల కంటే అధిక ఉత్పాదకత శక్తి గల కోళ్ళ రకాలను వివిధ పథకాల ద్వారా గ్రామీణ ప్రజలకు చేరువ చేయడానికి కె.వి.కె కషి చేస్తుందన్నారు. డా. ఎమ్. వెంకటలక్ష్మి, రైతులు, మహిళలు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యలపై దృష్టి సారించాలి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - గుడివాడ : గుడివాడ పట్టణ పరిధిలోని అంతర్గత డ్రైనేజీల సమస్యల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. సోమవారం ఏలూరురోడ్డులోని టిడిపి కార్యాలయ ప్రజావేదికలో మున్సిపల్ అధికారులతో ఎమ్మెల్యే రాము సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ శివారు కాలనీలైన ధనియాలపేట, వాంబే కాలనీ, న్యూ ఇందిరానగర్ కాలనీల్లో రూ.10 కోట్లతో జరుగుతున్న అభివద్ధి పనుల పురోగతిని పై అధికారులతో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణంలో శానిటేషన్ మెరుగుకు తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయని, ఇదే స్ఫూర్తితో గుడివాడ సుందరీకరణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. టిడ్కో కాలనీ సమస్యలపై ప్రత్యేక దష్టి పెట్టి, వాటి పరిష్కారానికి కషి చేస్తున్నామన్నారు. ఈ సమీక్ష సమావేశంలో గుడివాడ ఆర్‌డివో బాల సుబ్రహ్మణ్యం, మున్సిపల్ కమిషనర్ మనోహర్, ఎం.ఈ ప్రసాద్, టిడిపి పట్టణాధ్యక్షుడు దింట్యాల రాంబాబు, మున్సిపల్ డి.ఇలు శివాజీ, సతీష్‌చంద్ర, తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ

కిలారపు రంగప్రసాద్‌కు సత్కారం

ప్రజాశక్తి - గుడివాడ : గుడివాడ నియోజకవర్గ యాదవ సంఘం ఆధ్వర్యంలో ఎన్టీఆర్ స్టేడియం జాయింట్ సెక్రటరీ యోగాంధ్ర అవార్డు గ్రహీత కిలారపు రంగ ప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు. ఆదివారం రాత్రి స్థానిక ఏలూరురోడ్‌లోని కృష్ణ మందిరంలో యాదవ సంఘం అధ్యక్షులు డొక్కు రాంబాబు ఆధ్వర్యంలో స్టేడియం కమిటి జాయింట్ సెక్రటరీగా అనేక సేవలను అందిస్తున్న కిలరాపు రంగప్రసాద్ దంపతులను ముఖ్య అతిథులు యనమల నుగ్గాలమ్మ, కఠారి ఈశ్వర్‌కుమార్ సతీమణి మధురిమలు గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి గోళ్ళ రామకష్ణ, వేణుగోపాల స్వామి దేవస్థానం చైర్మన్ అంగడాల సతీష్, వివిధ సంఘాల నాయకులు ఆర్వీఎల్ నరసింహారావు. లంకదాసరి ప్రసాదరావు, గొర్ల శీను పాల్గొన్నారు.

ఐలయ్యకు గుర్రం జాషువా పురస్కారం

ప్రజాశక్తి - గుడివాడ : సామాజిక అసమానతలు మీద తనకలాన్ని కరవాలంగా జలిపించి తన రచనల ద్వారా పోరాటం చేసిన సామాజిక యోధుడు గుర్రం జాషువా స్ఫూర్తిని ప్రతిఒక్కరూ నింపుకొని సాంఘిక అసమానతలపై నిరంతరం పోరాటం చేసినప్పుడే కొంతమేరకు అయిన మార్పు వస్తుందని కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ నేలపాటి శామ్యూల్ అన్నారు. సోమవారం స్థానిక ఎన్‌జివోస్ హూంలో తెలుగు భాషా వికాస్ సమితి ఆధ్వర్యంలో గుర్రం జాషువా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు పిల్లలమర్రి అనిలేసు (ఐలయ్య)ను గుర్రం జాషువా సాహితీ స్ఫూర్తి పురస్కారం 2025ను అందజేసి ఘనంగా సత్కరించారు. భీమేశ్వ రాలయ ఉత్సవ కమిటీ చైర్మన్ పట్టపు వీరవెంకట సత్యనారాయణ(చిన్నా), తెలుగు భాష వికాస సమితి సమన్వయకర్త డిఆర్‌బి ప్రసాద్, జిల్లా ఎన్జీవో నాయకులు షేక్ ఫరీద్‌బాషా, వివిధ సంఘాలకు చెందిన నాయకులు గాదె మోహన్‌బాబు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అధికారిణి పద్మావతి

పంట నమోదు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి-పమిడిముక్కల : పంట నమోదు కార్యక్రమం వేగవంతం చేయాలని జిల్లా వ్యవసాయ అధికారిణి పద్మావతి అన్నారు. సోమవారం పమిడిముక్కల మండలంలోని రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ సిబ్బందితో మాట్లాడుతూ గ్రామాల్లో పర్యటించి పంట నమోదు వేగవంతం చేయాలన్నారు. ధాన్యం కొనుగోలప్పుడు ఇబ్బందులు రాకుండా పంట నమోదు ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సంయుక్త సంచాలకులు సునీల్, పమిడిముక్కల వ్యవసాయ అధికారి గణేష్ రెడ్డి పాల్గొన్నారు.

తెలుగుయువత ప్రధాన కార్యదర్శిగా జయప్రకాష్

ప్రజాశక్తి-కంకిపాడు : పెనమలూరు నియోజకవర్గ తెలుగు యువత ప్రధాన కార్య దర్శిగా యేనుగ జయప్రకాష్‌ను నియమించారు. తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు బోడే వెంకట్రామ్, కీలక నేత తుమ్మలపల్లి హరికృష్ణ సమక్షంలో జయప్ర కాష్‌కు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పచ్చిపాల రాజా, రెడ్నం శ్రీను, సుధీర్ పాల్గొన్నారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-పమిడిముక్కల : పమిడిముక్కల మండలంలోని కష్ణాపురం, పమిడిముక్కల, వీరంకిలాకు గ్రామాల్లో పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పర్యటించి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరంలాంటిదన్నారు. మండల టిడిపి అధ్యక్షులు రాజులపాటి శ్రీనివాసరావు, నాదెండ్ల సుబ్రహ్మణ్యం, స్వామి, బాపూజీ, మంటాడ వీర రాఘవులు పాల్గొన్నారు.

ఇలపర్రు భూములకు రోడ్డు సదుపాయం కల్పించాలి

ప్రజాశక్తి - గుడివాడ : ఎన్నో పోరాటాలతో సాధించుకున్న నందివాడ మండలం ఇలపర్రు భూములకు రోడ్డు సదుపాయం కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పవన్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఆంజనేయ పేటలోని సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత మూడు సంవత్సరాల నుంచి రైతులు దారి లేక ఇబ్బందులు పడుతున్నారని వెంటనే అధికారులు విచారించి చట్ట ప్రకారం తమ భూమికి సాగుకు అనుకూలంగా దారి ఏర్పాటు చేయాలని ఆర్డీవో బాలసుబ్రహ్మణ్యంకి వినతి పత్రాన్ని అందజేశామన్నారు. ఈ విషయంపై ఆర్డీవో సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కరిస్తానని తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం సీనియర్ నాయకులు నీలం మురళీ కృష్ణారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి బుంగా మరియదాసు, ఇలపర్రు గ్రామస్థులు ముత్యాల సువర్ణరాజు, కె

యాత్రికులకు సౌకర్యాలు కల్పించాలి

కమిషనర్ ధ్యానచంద్ర

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : భవానీలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. సోమవారం ఉదయం తన పర్యటనలో భాగంగా కెనాల్ రోడ్, వినాయకుని గుడి, శనీశ్వరాలయం, కృష్ణవేణి ఘాట్, సీతమ్మ పాదాలు, పున్నమి ఘాట్, హెచ్‌బి కాలనీ ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ముగిసినప్పటికీ యాత్రికుల తాకిడి ఎక్కువగా ఉన్న సందర్భంలో వారికి తాగునీటి సౌకర్యంలో ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని, ఉత్సవం అయిపోయిన తర్వాతే పారిశుధ్య నిర్వహణలో ఎక్కువగా దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. తదుపరి ఆర్‌టిసి వర్క్‌షాప్ రోడ్, హెచ్‌బి కాలనీలోని అన్న క్యాంటీన్లను పరిశీలించారు. అన్న క్యాంటీన్లో ఎటువంటి మరమ్మత్తులు ఉండరాదని, ఏవైనా ఉన్నచో వెంటనే 15 నిమిషాలలో వాటిని సరిచేయాలని, అన్న క్యాంటిన్లకు వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకూడదని, నోడల్ అధికారులు ఎప్పటికప్పుడు అన్న క్యాంటిన్‌ను పర్యవేక్షిస్తూ ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు.

బుడమేరు వరద ముంపు నివారణకు

శాశ్వత చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-విజయవాడ

బుడమేరు వరద ముంపు నివారణకు శాశ్వత చర్యలు చేపట్టాలని సింగ్‌నగర్ ఇందిరానాయక్ నగర్ నివాసులు ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి లక్ష్మీశాను కోరారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజాఫిర్యాదుల పరిష్కారవేదిక కార్యక్రమంలో స్థానిక ప్రజలను కలుపుకొని బుడమేరు ముంపు బాధితుల ఐక్యవేదిక కన్వీనర్ యంవి ఆంజనేయులు ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి లక్ష్మీశాకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ... బుడమేరు వరద వచ్చి సంవత్సరం దాటి పోయినా శాశ్వత చర్యలు చేపట్టలేదని అన్నారు. వర్షం వచ్చినప్పుడల్లా మరల వరద వస్తుందేమోనని సింగ్‌నగర్ ప్రజలు భయపడుతున్నామని పేర్కొన్నారు. బుడమేరు డైవర్షన్ ఛానల్ వెడల్పు పెంచి కనీసం 35,000 క్యుసెక్కుల నీరు కృష్ణానదిలో కలిసేవిధంగా చూడాలని కోరారు. విజయవాడ నగరానికి ముంపు లేకుండా మరొక అదనపు కాలువ నిర్మించి వరదనీరు ఎప్పటికప్పుడు పోయేవిధంగా చేయాలని కోరారు. బుడమేరు లోతు, వెడల్పు పెంచాలని అన్నారు. రెండు వైపుల కృష్ణానదికి నిర్మించిన విధంగా రిటైనింగ్ వాల్ నిర్మించాలని పేర్కొన్నారు. బుడమేరు పూడిక తీయించి రివెటింగ్ చేయించాలని కోరారు.

సిజెఐపై దాడికి ఖండన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: భారత ప్రధాన న్యాయమూర్తి భూషణ రామకృష్ణ గవాయిపై న్యాయవాది రాకేష్ కిషోర్ బూటుతో దాడి చేయడాన్ని నిరసిస్తూ జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అన్నెపాగ సుందరరావు ఆధ్వర్యంలో న్యాయవాదులు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అన్నెపాగ సుందరరావు మాట్లాడుతూ భారత ప్రధాన న్యాయమూర్తిపై దాడి అత్యంత హేయమని, న్యాయ వ్యవస్థకే గొడ్డలి పెట్టు అని, ప్రజాస్వామ్యానికి కళంకం తెచ్చిన దుర్మార్గులపై చట్టపరంగా శిక్షించాలని, న్యాయ స్థానాల్లో న్యాయవాద వృత్తి చేపట్టకుండా నిషేదించాలని తెలిపారు.

అంబేద్కర్ స్మృతివనం కార్మికులకు వేతనాలు ఇప్పించండి

- కలెక్టర్, విఎంసి కమిషనర్‌కు వేర్వేరుగా పిజిఆర్ఎస్‌లో వినతి పత్రాలు అందజేత

ప్రజాశక్తి-విజయవాడ : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్మృతి వనం కాంట్రాక్ట్ కార్మికులకు తొమ్మిది నెలలు నుంచి జీతాలు ఇవ్వకుండా కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని సిఐటియు నాయకులు కోరారు. ఈ మేరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ జి లక్ష్మీశాకు, విజయవాడ నగరపాలక సంస్థ కార్యాలయంలో విఎంసి కమిషనర్ ధ్యానచంద్రకు కార్మికులతో కలిసి సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు, సిఐటియు సెంట్రల్ సిటీ కమిటీ అధ్యక్షులు కె దుర్గారావు, నాయకులు ఎం బాబూరావు వేర్వేరుగా సోమవారం వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్మృతివనంలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు 9 నెలల నుంచి పెండింగ్ లో ఉన్న జీతాలు ఇవ్వకపోతే కార్మికులకు అండగా సిఐటియు నిలిచి, ఆందోళన ఉధతం చేస్తామని హెచ్చరించారు. కార్మికులకు జీతాలు పెండింగ్‌లో ఉండటం వల్ల వారి కుటుంబాలు రోడ్డున పడాల్సిన పరిస్థితి నెలకొందని అన్నారు. కూటమి ప్రభుత్వానికి కార్మికుల పట్ల చిత్తశుద్ధి లేదని అన్నారు. తక్షణమే జిల్లా కలెక్టర్, నగర కమిషనర్ జోక్యం చేసుకొని వెంటనే కార్మికుల పెండింగ్ వేతనాలు ఇప్పించాలని, లేనిపక్షంలో సిఐటియు నేతృత్వంలో అన్ని ప్రజా సంఘాలను కలుపుకొని ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎం.సోమేశ్వరరావు. ఎం.హనుమంతరావు కాంట్రాక్ట్ కార్మికులు పి.సునీత, సి.హెచ్.విజయ్ కుమారి, ఎం. సుజాత, కె.అనుష, ఎం.దీపిక, హరిత, కె.ధనలక్ష్మి, పి.సత్యవతి, ఎస్.కె జహిందా,మణెమ్మ, దయామని, తదితరులు పాల్గొన్నారు.

కరాటే విజేతలకు అభినందన

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరులోని రేవంత్ డిఫెన్స్ స్కూల్ కరాటే శిక్షణ పొందుతూ పలు పోటీల్లో విజేతలుగా నిలుస్తున్న విద్యార్థులు వరల్డ్ కరాటే మాస్టర్స్ అసోసియేషన్ నుంచి ప్రశంసా పత్రాలు అందుకున్నట్లు కరాటే కోచ్ మరకాల రేవంత్ తెలిపారు. చెన్నైలో ఆదివారం కొంగల జెస్సీ, జెట్టి జ్యోత్స్న, గోదా నిఖిల్, గరిడేపల్లి ధన్యశ్రీ, గోదా రోహన్ పునీత్‌లను అసోసియేషన్ సభ్యులు అభినందించారని తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పలువురు పట్టణ ప్రముఖులు అభినందించారు.

బూడిద కాంట్రాక్టును ప్రైవేటుకు కట్టబెట్టడాన్ని నిరసిస్తూ ధర్నా

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం: ఎన్‌టిటిపిఎస్ నుంచి వచ్చే బూడిద కాంట్రాక్టును ప్రైవేటు వ్యక్తులకు టెండర్ ద్వారా కట్ట బెట్టడాన్ని నిరసిస్తూ స్థానిక ఎన్‌టిటిపిఎస్ బూడిద లారీ సొసైటీ ఆధ్వర్యంలో గత కొద్దిరోజులుగా నిరసన ర్యాలీలు చేపట్టారు. ఇందులో భాగంగా ఎన్‌టిటిపిఎస్ పాత గేటు వద్ద బూడిద లారీ ఓనర్స్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ, ధర్నా నిర్వహించారు. ఎన్‌టిటిపిఎస్‌పై బూడిద లారీ ఓనర్స్ సొసైటీ గత 40 రోజులుగా నిరసన కార్యక్రమాలు చేపట్టినప్పటికీ ఎన్‌టిటిపిఎస్ యాజమాన్యం స్పందించక పోవడంతో బూడిద పీడిత గ్రామాల ప్రజలతో పశ్చిమ ఇబ్రహీంపట్నం నుంచి విటిపిఎస్ పాత గేటు వరకు ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. ఎట్టకేలకు ఎన్‌టిటిపిఎస్ సిఇ రామాంజనేయులు దీక్షా శిబిరం వద్దకు వచ్చి లారీ ఓనర్స్ సొసైటీ సభ్యుల సమస్యలు తెలుసుకున్నారు. అధికారులకు సమస్య తీవ్రతను, ఎదురవుతున్న ఆటంకాలను వివరించి శుక్రవారంలోగా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ధర్నాలో జనసేన మైలవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ అక్కల రామ్మోహన్ రావు (గాంధీ), శ్రీకాంత్, కొండపల్లి మున్సిపాలిటీ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, వైస్ చైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాసరావు, కౌన్సిలర్లు రావి ఫణి, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్ కండీషనర్లపై

'గో సేవ్ టుడే' ఆఫర్లు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : అతిపెద్ద కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ శామ్‌సంగ్, ఈ పండుగ సీజన్‌లోవినియోగదారులకు రూ.21000 వరకు ఆదాను అందించే బెస్పోక్ ఎఐ ఎయిర్ కండిషనర్లపై "గో సేవ్ టుడే" ప్రచారాన్ని ప్రకటించిందని సంస్థ ప్రతినిధి కె.రాజేష్ ఒక ప్రకటనలో తెలిపారు. జీఎస్టీ రేటు తగ్గింపులు, మెరుగైన వారంటీ ప్రయోజనాలు, ఇంధన ఆదా అనే మూడు స్తంభాలపై నిర్మించబడిన గో సేవ్ టుడే ప్రచారం, ఈ పండుగ సీజన్‌లో వినియోగదారులకు సాటిలేని విలువనిస్తుందని తెలిపారు. "గో సేవ్ టుడే" ప్రచారంలో భాగంగా, కస్టమర్‌లు ప్రీమియం బెస్పోక్ ఏఐ ఎయిర్ కండిషనర్ల కొనుగోలుపై ప్రత్యేకమైన ఆఫర్‌ను పొందుతారని తెలిపారు.

సత్వరమే సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-విజయవాడ : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను కమిషనర్ ధ్యానచంద్ర ప్రధాన కార్యాలయంతో పాటు జోనల్ కార్యాలయాల్లో, సచివాయాలలో సోమవారం విసి ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో స్వీకరించే ప్రతి సమస్యను సత్వరమే పరిష్కరించాలని, ప్రజలకు ఎటువంటి సమస్య రానివ్వకుండా అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో తమ తమ పరిధిలో గల ప్రాంతాలన్నీ పర్యటించి సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరించాలని, స్వీకరించిన ప్రతి ఫిర్యాదును వెంటనే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని, అధికారులు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో స్వీకరించిన సమస్య ను ఫిర్యాదునీదారుల వద్దకు వెళ్లి సమస్యను పూర్తిస్థాయిలో తెలుసుకొని మరలా పునరావతం కాకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 19 ఫిర్యాదులు అందగా అందులో పట్టణ ప్రణాళిక సంబంధించినవి 4, ఇంజనీరింగ్ 10, రెవిన్యూ 3, ఎస్టేట్ 1, హార్టికల్చర్ 1 మొత్తం కలిపి 19 ఫిర్యాదులను అందుకున్నారు అధికారులు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ ప్రాజెక్ట్ డాక్టర్ డి చంద్రశేఖర్, చీఫ్ ఇంజనీర్ ఆర్ శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్, జాయింట్ డైరెక్టర్ అమత్ డాక్టర్ లత, డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ ఇంచార్జ్ మరియు ఎస్టేట్ ఆఫీసర్ ఎ శ్రీధర్, పాల్గొన్నారు.

ప్రత్యేక రైలులో ప్రసిద్ధ పుణ్యక్షేత్రాల యాత్ర

- తమిళనాడు, కేరళలోని దేవాలయాల దర్శనం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

ప్రత్యేక రైలులో ప్రసిద్ధ పుణ్యక్షేత్రాల యాత్ర నవంబర్లో ప్రారంభించనున్నామని భారతీయ రైల్వేస్ భారత్ గౌరవ్ రైల్, సౌత్ స్టార్ రైల్ డైరెక్టర్ విఘ్నేష్ తెలిపారు. విజయవాడ బెంజ్ సర్కిల్‌లో ఉన్న హోటల్ ఐరాలో సోమవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రత్యేక పర్యాటక రైలులో తమిళనాడు, కేరళలో ఉన్న దేవాలయాలు, పంచద్వారక, మహదేవ్, జ్యోతిర్లింగాలు దర్శించుకునే అవకాశం కలదన్నారు. ఈ యాత్రలో ఒక యాత్ర నవంబర్ 16న, మరో యాత్ర 26న ప్రారంభం కానుందన్నారు. ఇండియన్ రైల్వే, మొదటి భారత్ గౌరవ్ రైలు, సౌత్ స్టార్ రైల్, అతిపెద్ద టూరిస్ట్ రైలు ఆపరేటర్ టూర్ టైమ్స్ ఈ యాత్ర చేపట్టిందన్నారు. ఈ ప్రత్యేక పర్యాటక రైలు ఐఆర్‌టిసి వెబ్‌సైట్‌లో అందుబాటులో లేదని, రిజర్వేషన్ల కోసం టూర్ టైమ్స్‌ను నేరుగా 93550 21516 నెంబర్లను సంప్రదించాలన్నారు. ఆన్‌లైన్‌లో కూడా బుక్ చేసుకోవచ్చని తెలిపారు. అందుకోసం www.tourtimes.in సందర్శించాలని కోరారు. తమిళనాడు, కేరళ దేవాలయాల యాత్ర నవంబర్16న ప్రారంభమవుతుందని, ఈ యాత్రలో తిరుకడైయూర్, చిదంబరం, అరుణాచలం, తిరుచ్చి, తంజావూరు, రామేశ్వరం, మధురై, కన్యాకుమారి, తిరువనంతపురం, చొట్టనిక్కర, గురువాయూర్ కలవని తెలిపారు. పదకొండు రోజుల ఈ యాత్రకు సెకండ్ స్లీపర్ రూ.19,950, థర్డ్ ఎసి రూ.29,750, సెకండ్ ఎసి రూ.37,750, ఫస్ట్ ఎసి రూ.42,950 ఛార్జీలుఉన్నాయన్నారు. పంచద్వారక, మహదేవ్, జ్యోతిర్లింగాల యాత్ర నవంబర్ 26న ప్రారంభం కానుందని, ఈ యాత్రలో పంచద్వారకతో పాటు నిష్కళంక మహదేవ్, జ్యోతిర్లింగాల దర్శనం ఉంటుందని తెలిపారు. ఇందులో ద్వారక, డాకోర్ ద్వారక, నాథ్ ద్వారక, కంక్రోలి ద్వారక, బేట్ ద్వారక, సోమనాథ్, నాగేశ్వర్, సోమనాథ్, నాగేశ్వర్, నిష్కలంక మహదేవాలయంతోపాటు యాదగిరి, స్టాట్యూ అఫ్ ఈక్విటీ, స్టాట్యూ అఫ్ యూనిటీ ఉంటాయని తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.